ప్రతి అక్షరం ప్రజాహితం

RNI No: APTEL -2023/89112 www.andhrapragathi.com

# నేటి ఆంధ్రప్రగతి

తెలుగు దినపత్రిక

సంపుటి - 02 సంచిక -121 పేజీలు - 08 వెల - 04/- శుక్రవారం 14 ఫిబ్రవరి 2025

## పార్లమెంట్ ముందుకు కొత్త ఐటి చట్టం

**నిరసనల మధ్యే ప్రవేశ పెట్టిన నిర్మలా సీతారామన్**

**విపక్షాల వాకౌట్...లోక్‌సభ మార్చి 10కి వాయిదా**




న్యూఢిల్లీ,ఫిబ్రవరి 13 ఆంధ్ర ప్రగతి : ప్రస్తుతం అమలులో ఉన్న దశాబ్దాల నాటి ఆదాయపు పన్ను చట్టం స్థానంలో కేంద్రం కొత్త చట్టాన్ని తీసుకురానుంది. దీనిలో భాగంగా ఆదాయపు పన్ను (ఐటీ) నూతన బిల్లు పార్లమెంటు ముందుకు వచ్చింది. విపక్షాల నిరసనల మధ్యే కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ ఈ బిల్లును లోక్‌సభలో ప్రవేశపెట్టారు. బడ్జెట్‌లో ప్రకటించిన మేరకు బిల్లును తీసుకుని వచ్చారు. అయితే విపక్షాలు సభ నుంచి వాకౌట్ చేశాయి. బిల్లుకు నిరసనగా వాకౌట్ చేయడం గమనార్హం. అనంతరం కాసేపటికే లోక్‌సభ మార్చి 10కి వాయిదా పడింది. 1961లో రూపొందించిన ఆదాయపు పన్ను చట్టానికి, ఎన్నో సవరణలు జరిగాయి. మిగతాది 2లో...

# వల్లభనేని వంశీ అరెస్ట్..

- 2023 ఫిబ్రవరి 20న గన్నవరం టీడీపీ కార్యాలయంపై దాడి
- వంశీ సహా 88 మందిని నిందితులుగా చేర్చిన పోలీసులు
- ఇదే కేసులో వంశీని అరెస్ట్ చేసినట్టు సమాచారం
- సుమారు 8 గంటల పాటు వల్లభనేని వంశీని విచారించిన పోలీసులు
- కృష్ణలంక పోలీస్ స్టేషన్‌లో ముగిసిన విచారణ
- విచారించిన అంశాలతో రిమాండ్ రిపోర్టును సిద్ధం చేసిన పోలీసులు
- విజయవాడ ఆసుపత్రిలో వైద్య పరీక్షలు

2లో





## మణిపూర్‌లో రాష్ట్రపతి పాలన



**కేంద్ర హెూంశాఖ నోటిఫికేషన్**

**ముఖ్యమంత్రి బీరెన్ సింగ్ రాజీనామా చేసిన రోజుల వ్యవధిలోనే రాష్ట్రపతి పాలన**


**జాతుల మధ్య ఘర్షణతో అట్టుడుకుతున్న మణిపూర్**

న్యూఢిల్లీ,ఫిబ్రవరి 13 ఆంధ్ర ప్రగతి : మణిపూర్‌లో కేంద్ర ప్రభుత్వం రాష్ట్రపతి పాలన విధించింది. జాతుల మధ్య ఘర్షణలతో అట్టుడుకుతున్న మణిపూర్ రాష్ట్రంలో రాష్ట్రపతి పాలన విధిస్తున్నట్లు కేంద్ర హెూంశాఖ నోటిఫికేషన్ జారీ చేసింది. ముఖ్యమంత్రి బీరెన్ సింగ్ ఇటీవల తన పదవికి రాజీనామా చేశారు. మిగతాది 2లో...

## వక్ఫ్ బిల్లుకు రాజ్యసభ ఆమోదం

**నిరసనల మధ్యే ప్రవేశ పెట్టిన ప్రభుత్వం**

**-గందరగోళం మధ్య సభ వాయిదా**



న్యూఢిల్లీ,ఫిబ్రవరి 13 ఆంధ్ర ప్రగతి :: 'వక్ఫ్ సవరణ బిల్లు-2024'పై జాయింట్ పార్లమెంటరీ కమిటీ (జేపీసీ) రూపొందించిన నివేదికను కేంద్ర ప్రభుత్వం గురువారం రాజ్యసభలో ప్రవేశపెట్టింది. మిగతాది 2లో...

## ఎలక్ట్రానిక్స్, టెక్స్‌టైల్స్, ఫుట్‌వేర్ రంగాల అభివృద్ధికి తైవాన్ సహకారం

**తైవాన్ అధికారుల బృందంతో మంత్రి నారా లోకేశ్ భేటీ**

**తైపేయి ఎకనామిక్ అండ్ కల్చరల్ సెంటర్ ఇన్ చెన్నై డైరెక్టర్ తో మంత్రి చర్చలు**

**టెక్స్‌టైల్స్, ఫుట్‌వేర్ రంగాల అభివృద్ధితో లక్షలాది మంది యువతకు ఉద్యోగ అవకాశాలు**

అమరావతి, ఫిబ్రవరి 13 ఆంధ్ర ప్రగతి : ఆంధ్రప్రదేశ్‌లో ఎలక్ట్రానిక్స్, టెక్స్‌టైల్స్, ఫుట్‌వేర్ రంగాల అభివృద్ధికి తైవాన్ సహకారం కోరారు విద్య, ఐటి, ఎలక్ట్రానిక్స్ శాఖల మంత్రి నారా లోకేశ్. ఉండవల్లి నివాసంలో తైపేయి ఎకనామిక్ అండ్ కల్చరల్ సెంటర్ ఇన్ చెన్నై డైరెక్టర్ జనరల్ రిచర్డ్ చెన్‌తో నారా లోకేశ్ చర్చలు జరిపారు. ఎలక్ట్రానిక్స్, టెక్స్‌టైల్స్, ఫుట్‌వేర్ తయారీ రంగాల్లో తైవాన్ అగ్రగామిగా ఉంది. మిగతా 2లో...



## తెలుగుదేశం పార్టీలో చేరిన మాజీ మంత్రి ఆళ్ల నాని

**ఉండవల్లిలో చంద్రబాబు సమక్షంలో టీడీపీలో చేరిన ఆళ్ల నాని**

**కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించిన చంద్రబాబు**

**కార్యక్రమంలో పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు ఇతర నాయకులు**



6లో

## అమెరికా చేరుకున్న ప్రధాని మోడీ



**రాయబారి వినయ్ క్వాత్రా స్వాగతం**

**ద్వైపాక్షిక సంబంధాలపై ట్రంప్‌తో చర్చలు**

**ఎలన్‌మస్క్‌తోనూ చర్చించే ఛాన్స్**

**చారిత్రక బ్లెయిర్ హౌస్‌లో మోడీకి బస**



2లో

# పనులు ఆలస్యమయితే ఊరుకోము

**జలవనరుల శాఖపై సమీక్షలో సీఎం చంద్రబాబు నాయుడు వ్యాఖ్యలు**



- అన్ని అనుమతులు, నిధులు ఉన్న ప్రాజెక్టుల్లో జాప్యాన్ని సహించేది లేదు
- 2027 జూన్ లక్ష్యంగానే పోలవరం పనులు జరగాలి
- పోలవరం ఫలితాలు వచ్చేనాటికి ఉత్తరాంధ్ర సుజల స్రవంతి అదుబాటులోకి రావాలి
- గ్రౌండ్ వాటర్ పెంపుపై ప్రణాళికకు నాలుగు శాఖల మంత్రులతో కమిటీ
- వెలుగొండ ప్రాజెక్టుపై ప్రత్యేక దృష్టి.. త్వరలో ప్రాజెక్టును సందర్శిస్తా

అమరావతిఫిబ్రవరి 13 ఆంధ్ర ప్రగతి : ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో సాగునీటి ప్రాజెక్టుల పనులు నిర్దేశిత లక్ష్యాల మేరకు జరగాల్సిందేనని ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు స్పష్టం చేశారు. గత ప్రభుత్వం సాగునీటి రంగానికి తీవ్ర అన్యాయం చేసిందని, వాటిని సరిదిద్ది రైతులకు సాగునీరు అందించాలంటే లక్ష్యాలను చేరుకునేలా పనులు వేగవంతంగా జరగాలని ఆయన అన్నారు. ముఖ్యంగా పోలవరం వంటి భారీ ప్రాజెక్టుల్లో ఈ రోజుకు ఎంత పని జరగాలనే దానిపై దృష్టి సారించాలని ఆయన ఆదేశించారు. ప్రతి నెలా ఎంత పని జరగాలనేది లక్ష్యంగా పెట్టుకుని, ఆ మేరకు పనులు పూర్తయ్యాయా? లేదా అనేది క్రమం తప్పకుండా సమీక్షించుకోవాలని ముఖ్యమంత్రి సూచించారు. నిర్దేశించుకున్న లక్ష్యాల మేరకు పనులు జరగకపోతే అధికారులు, కాంట్రాక్టర్లు బాధ్యత వహించాల్సి ఉంటుందని ఆయన హెచ్చరించారు. మిగతాది 2లో...

# పనులు ఆలస్యమయితే ఊరుకోము

**(మొదటి పేజీ తరువాయి)**

అనుమతులు ఉండి, నిధుల సమస్య లేని ప్రాజెక్టుల్లో జాప్యాన్ని ఏమాత్రం సహించేది లేదని ముఖ్యమంత్రి స్పష్టం చేశారు. సచివాలయంలో జలవనరుల శాఖపై ముఖ్యమంత్రి సమీక్ష నిర్వహించారు. ప్రస్తుతం నిర్మాణంలో ఉన్న వివిధ సాగునీటి ప్రాజెక్టుల పనులు, కొత్తగా చేపట్టే ప్రాజెక్టులపై ఆయన సమీక్ష జరిపారు.

సమావేశంలో భాగంగా, ముందుగా పోలవరం ప్రాజెక్టు పనుల గురించి అధికారులు ప్రజెంటేషన్ ఇచ్చారు. మొత్తం 1,379 మీటర్ల డయాఫ్రం వాల్ నిర్మాణం జరగాల్సి ఉండగా, గత నెలలో ప్రారంభమైన పనుల్లో ఇప్పటి వరకు 35 మీటర్లు పూర్తయిందని, ఇంకా 1,344 మీటర్లు పూర్తి చేయాల్సి ఉందని అధికారులు వివరించారు.

పోలవరం ఎడమ కాలువ కనెక్టివిటీ పనుల్లో కొంత జాప్యం జరిగిందని అధికారులు తెలపగా, పనులు వేగవంతం చేయాలని ముఖ్యమంత్రి ఆదేశించారు. వచ్చే సమీక్ష నాటికి పనుల్లో వృద్ధి కనిపించాలని ఆయన అన్నారు. పోలవరం కాలువల సామర్థ్యం విషయంలో మొదట ఎంత సామర్థ్యంతో (17500 క్యూసెక్కులు) అయితే డిజైన్ చేశారో, అంతే సామర్థ్యం మేర నిర్మాణం చేపట్టాలని సూచించారు. అనుమతులు, నిధులు ఉన్నందున పోలవరం ప్రాజెక్టు పనులు వేగంగా జరగాలని, 2027 జూన్ నాటికి ప్రాజెక్టును పూర్తి అవ్వాలనే లక్ష్యంతో పనులు చేయాలని ఆదేశించారు.

ఏ కారణాల వల్లనైనా అయినా 2027 జూన్ నాటికి పనులు పూర్తి కాకపోతే, 2027 డిసెంబర్ నాటికి ఖచ్చితంగా పూర్తి చేయాలని ముఖ్యమంత్రి ఆదేశించారు. పోలవరం ఎడమ కాలువ పనులు పూర్తి చేసి విశాఖకు నీళ్లు తీసుకువెళ్లే సమయానికి, ఉత్తరాంధ్ర సుజల స్రవంతి ప్రాజెక్టు కూడా అందుబాటులోకి రావాలన్నారు. తద్వారా గోదావరి నీటిని ఉత్తరాంధ్ర ప్రాజెక్టులకు మళ్లించే అవకాశం లభిస్తుందని ముఖ్యమంత్రి తెలిపారు.

చింతలపూడి ఎత్తిపోతల పథకం పనులకు సంబంధించి కోర్టుల్లో ఉన్న సమస్యలను పరిష్కరించి, పనులు సజావుగా సాగేలా చూడాలని సూచించారు. వెలిగొండ ప్రాజెక్టు విషయంలో జరుగుతున్న జాప్యంపై ముఖ్యమంత్రి ఆవేదన వ్యక్తం చేశారు. ఉమ్మడి రాష్ట్రంలో తన చేతుల మీదుగా వెలిగొండ ప్రాజెక్టుకు శంకుస్థాపన చేశానని, ఆ ప్రాంత అవసరాలను గుర్తించి 2014-19 మధ్యలో అత్యంత ప్రాధాన్యం ఇచ్చి పనులను ముందుకు తీసుకువెళ్లానని ఆయన గుర్తు చేశారు. అయితే, ఆ తర్వాత వచ్చిన ప్రభుత్వం డ్రామాలు చేసి, పూర్తి కాని ప్రాజెక్టును ప్రారంభోత్సవం చేసిందని విమర్శించారు. దీనివల్ల ఆ ప్రాంత ప్రజలకు తీవ్ర నష్టం జరిగిందని ఆయన అన్నారు. 25 ఏళ్ల క్రితం అనుకున్న ప్రాజెక్టు నేటికీ పూర్తి కాకపోవడం బాధాకరమని ముఖ్యమంత్రి అన్నారు. ఈ ప్రాజెక్టుపై ఎక్కువ దృష్టి పెట్టాలని అధికారులకు సూచించారు. ఈ ప్రాజెక్టు విషయంలో గత ప్రభుత్వం చేసిన మోసాలను ప్రజలకు వివరించాలని, తాము ఎలా న్యాయం చేయబోతున్నామో కూడా ప్రజలకు తెలియజేయాలని అన్నారు. అధికారులు ఈ ప్రాజెక్టు పూర్తిపై ప్రత్యేక శ్రద్ధ పెట్టాలని, తాను కూడా ప్రాజెక్టును సందర్శించి, త్వరితగతిని ప్రాజెక్టు పూర్తి చేసేందుకు చర్యలు తీసుకుంటానని ఆయన తెలిపారు.

**పోలవరం-బనకచర్ల కార్పొరేషన్**

రాష్ట్రాన్ని కరువు రహితంగా మార్చే పోలవరం-బనకచర్ల అనుసంధాన ప్రాజెక్టును పట్టాలెక్కించాలని ముఖ్యమంత్రి చంద్రబాబు అన్నారు. పోలవరం-బనకచర్ల కార్పొరేషన్ ఏర్పాటు చేయాలని అధికారులకు సూచించారు. దీనిపై కసరత్తు చేయాలని ఆదేశించారు. నిధుల సమీకరణ కోసం కేంద్రంతో చర్చిస్తున్నామని, దీనిపై పలు ఆలోచనలు ఉన్నట్లు ముఖ్యమంత్రి తెలిపారు. పంట కాలువల నిర్వహణను ప్రైవేటు సంస్థలకు ఇచ్చే అంశాన్ని కూడా ఆయన ప్రస్తావించారు. ఇరిగేషన్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ కింద ఉన్న వెయ్యికి పైగా చిన్న ఎత్తిపోతల పథకాలను తిరిగి మళ్లీ అందుబాటులోకి తెచ్చేందుకు తీసుకోవాల్సిన చర్యలపై సమీక్షలో చర్చించారు.

**భూగర్భ జలాల పెంపు నా కల**

భూగర్భ జలాల పెంపు అంశంపై తాను మొదటి నుంచి ప్రయత్నం చేస్తున్నానని ముఖ్యమంత్రి అన్నారు. ఉమ్మడి రాష్ట్రంలో సైతం భూగర్భ జలాల పెంపునకు అనేక చర్యలు తీసుకున్న విషయాన్ని ఆయన గుర్తు చేశారు. భూమిలో 3 నుంచి 9 మీటర్ల లోతులో భూగర్భ జాలాల లభ్యమయ్యేలా చూడాల్సిన అవసరం ఉందన్నారు. రిజర్వాయర్లలో నీటిని సమృద్ధిగా ఉంచి, ఉత్తమ నీటి యాజమాన్య పద్ధతులు అవలంబించడంతో పాటు భూమిలో నీటి లభ్యతను పంచేందుకు అన్ని శాఖలు కలిసి పని చేయాలని సూచించారు.

భూగర్భ జలాల పెంపునకు తీసుకోవాల్సిన చర్యలపై ప్రణాళిక కోసం పంచాయతీ రాజ్, ఫారెస్ట్, ఇరిగేషన్, వ్యవసాయ, మునిసిపల్ శాఖ మంత్రులతో కలిసి ఒక కమిటీని ఏర్పాటు చేస్తామని ముఖ్యమంత్రి తెలిపారు. ఈ కమిటీ భూగర్భ జలాల పెంపు, పచ్చదనం పెంపుపై కసరత్తు చేసి సూచనలు చేస్తుందని ఆయన అన్నారు. ఈ సమీక్షలో జలవనరుల శాఖ మంత్రి నిమ్మల రామానాయుడు, ఇరిగేషన్ శాఖ అధికారులు పాల్గొన్నారు.

# అమెరికా చేరుకున్న ప్రధాని మోడీ

వాషింగ్టన్,ఫిబ్రవరి 13 ఆంధ్ర ప్రగతి :

అమెరికాలో రెండు రోజుల పర్యటన కోసం ప్రధానమంత్రి నరేంద్ర మోదీ వాషింగ్టన్‌కు చేరుకున్నారు. అమెరికాలోని భారత రాయబారి వినయ్ మోహన్ క్వాత్రా, ఇతర అధికారులు ప్రధాని మోదీని విమానాశ్రయంలో స్వాగతించారు. ప్రధానమంత్రి నరేంద్ర మోదీ రెండు రోజుల పర్యటన కోసం గురువారం అమెరికాకు చేరుకున్నారు. అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ఆహ్వానం మేరకు ఆయన అమెరికా పర్యటన చేపట్టారు. ఈ క్రమంలో ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ఎక్స్‌లో పోస్ట్ చేశారు. 'డొనాల్డ్ ట్రంప్‌ను కలవడానికి, భారతదేశం-యుఎస్ఎ సమగ్ర ప్రపంచ వ్యూహాత్మక భాగస్వామ్యాన్ని నిర్మించడానికి ఎదురుచూస్తున్నాను. మన దేశాలు, మన ప్రజల ప్రయోజనం కోసం మెరుగైన భవిష్యత్తు కోసం కలిసి పనిచేస్తూనే ఉంటాయి' అని ఆయన పేర్కొన్నారు. ప్రధానమంత్రి నరేంద్ర మోదీ గురువారం తెల్లవారు జామున అమెరికాకు చేరుకున్నారు. ఫ్రాన్స్‌లో తన రెండు రోజుల పర్యటనను ముగించిన తర్వాత అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్‌ను కలవడానికి. వారు ప్రతినిధి స్థాయి ఫార్మాట్లలో ద్వైపాక్షిక సమావేశాలను నిర్వహిస్తారు. గురువారం వాషింగ్టన్‌లో అధ్యక్షుడు ట్రంప్‌తో జరిగే సమావేశానికి ముందు మోడీ అదనపు సుంకాల కోతలకు సిద్ధమవుతున్నారు. ఇది భారతదేశానికి అమెరికన్ ఎగుమతులను పెంచవచ్చు.

అధ్యక్షుడు ట్రంప్, డోజ్ అధిపతి ఎలాన్ మస్క్‌తో భేటీ కానున్నారు. ఈ సందర్భంగా మోదీకి భారత సంతతి వారు ఘనంగా స్వాగతం పలికారు. ఈ పర్యటనలో భాగంగా ప్రధాని మోదీ ప్రపంచంలోనే అత్యంత ప్రత్యేకమైన అతిథి గృహంలో బస చేస్తున్నారు. 1651 పెన్సిల్వేనియా అవెన్యూలోని బ్లెయిర్ హౌస్ ఆయనకు ఆతిథ్యం ఇస్తోంది. ఈ భవనం శ్వేత సౌధానికి ఎదురుగా ఉండటం దీని విశేషం. అమెరికాలో పర్యటించే అత్యంత ప్రత్యేకమైన అతిథులకు ఇక్కడ బస ఏర్పాటు చేస్తారు. గతంలో చాలా మంది దేశాధ్యక్షులు, రాజకుటుంబ సభ్యులకు దీనిని విడిదిగా వాడారు. దౌత్యపరంగా ప్రాధాన్యమున్న భవనంగా దీనిని భావిస్తారు. ఇది కేవలం విలాసవంతమైన గెస్ట్‌హౌస్ మాత్రమే కాదు. అమెరికా ఆతిథ్యానికి చిహ్నంగా నిలిచింది. దాదాపు 70 వేల చదరపుటడుగుల్లో నాలుగు భవనాలు అనుసంధానమై ఉండటం దీని ప్రత్యేకత. ఇక్కడ మొత్తం 119 గదులు ఉన్నాయి. వీటిలో 14 బెడ్రూమ్‌లు, 35 బాత్ రూమ్‌లు, మూడు డైనింగ్ గదులున్నాయి. అత్యాధునిక బ్యూటీ సెలూన్ కూడా దీనిలో ఉంది.



ఇక్కడి వచ్చిన అతిథులకు ఫైవ్‌స్టార్ ఆతిథ్యం ఇస్తారు. అమెరికా చరిత్రను తెలిపే పురాతన వస్తువులు, ఆర్ట్స్‌తో దీనిని అలంకరించారు. 1824లో ఈ భవనాలను నిర్మించారు. ప్రెస్టోన్ ఫ్రాన్సిస్ బ్లెయిర్ 1837లో కొనుగోలు చేశారు. ఆయన పేరును దీనికి పెట్టారు. రెండో ప్రపంచ యుద్ధం ముగిసిన తర్వాత శ్వేతసౌధానికి అతిథుల తాకిడి గణనీయంగా పెరిగింది. చాలా దేశాధినేతలు, సైన్యాధినేతలు అక్కడే బస చేసేవారు. ఆ తర్వాత 1942లో అమెరికా ప్రభుత్వం ఈ హౌస్‌ను అద్దెకు తీసుకొంది. ఆ ఏడాది చివరి నాటికి 1.56లక్షల డాలర్లకు కొనుగోలు చేసింది. అమెరికా పర్యటనలో భాగంగా ప్రధాని మోదీ ఆ దేశ డైరెక్టర్ ఆఫ్ నేషనల్ ఇంటెలిజెన్స్ తులసీ గబ్బర్డ్‌తో భేటీ అయ్యారు. వీరిద్దరూ పలు అంశాలపై చర్చించారు. డీఎన్ఐగా ఆమె నేడు పదవీ బాధ్యతలు చేపట్టడం విశేషం.

# మణిపూర్‌లో రాష్ట్రపతి పాలన

**(మొదటి పేజీ తరువాయి)**

అనంతరం కొద్ది రోజుల వ్యవధిలోనే కేంద్రం రాష్ట్రపతి పాలన విధించింది. మణిపూర్ గవర్నర్ సమర్పించిన నివేదికతో పాటు ఇతర నివేదికల సమాచారాన్ని పరిశీలించిన మీదట అక్కడ రాజ్యాంగబద్ధ పాలనను కొనసాగించే పరిస్థితి లేదని అంచనాకు వచ్చామని కేంద్ర హోంమంత్రిత్వ శాఖ తెలిపింది. ఈ నేపథ్యంలో రాజ్యాంగంలోని ఆర్టికల్ 356 ప్రకారం రాష్ట్రపతికి సంక్రమించిన అధికారాలతో రాష్ట్రపతి పాలన విధిస్తూ నిర్ణయం తీసుకున్నట్లు రాష్ట్రపతి ద్రౌపది ముర్ము ఆదేశాల్లో పేర్కొన్నట్లు వెల్లడించింది.

# పార్లమెంట్ ముందుకు కొత్త ఐటి చట్టం

దీంతో సంక్లిష్టంగా తయారైంది. పన్ను చెల్లింపుదార్లకు వ్యయాలూ పెరిగాయి. దీంతో ఈ చట్టాన్ని సమీక్షించి, సరళతరం చేస్తామని 2024 జులై బడ్జెట్‌లో ప్రభుత్వం పేర్కొంది. ఆ మేరకు ఇప్పుడు బిల్లును రూపొందించారు. ఈ చట్టాన్ని సమీక్షించడానికి కేంద్ర ప్రత్యక్ష పన్నుల మండలి ఒక అంతర్గత కమిటీని ఏర్పాటు చేసింది. చట్ట సమీక్షకు 22 ప్రత్యేక సబ్ కమిటీలనూ ఏర్పాటు చేశారు. మొత్తం మీద కొత్త చట్టం సమీక్ష నిమిత్తం 6500 సలహాలను ఆదాయ పన్ను విభాగం అందుకుంది. వీటన్నిటినీ పరిగణనలోకి తీసుకుని, కొత్త బిల్లు తీసుకొచ్చారు. మొన్నటి బడ్జెట్‌లో కూడా ఆదాయపు పన్న విషయంలో సరళీకరణ చేపట్టామని అన్నారు. అందుకు అనుగుణంగా కొట్ట ఐటి చట్టానికి ఇటీవలే కేబినేట్ ఆమోదించింది. దానికి చట్టబద్ధత కల్పించేందుకు పార్లమెంటు ముందుకు తీసుకుని వచ్చారు.

---------

# వక్ఫ్ బిల్లుకు రాజ్యసభ ఆమోదం

**(మొదటి పేజీ తరువాయి)**

జేపీసీకి చైర్మన్‌గా వ్యవహరించిన జగదంబికా పాల్, బిజెపి ఎంపీ సంజరు తదితరులు ఈ ముసాయిదా బిల్లుపై తమ నివేదికను హిందీ, ఇంగ్లీష్ భాషల్లో సభ ముందుకు తీసుకొచ్చారు. ఈ బిల్లుపై నివేదికను రాజ్యసభ ఎంపీ మేధా కులకర్ణి సభలో ప్రవేశపెట్టారు. ఈ సందర్భంగా సభలో గందరగోళం నెలకొంది. నివేదికపై ప్రతిపక్ష ఎంపీలు నిరసన తెలిపారు. తాము సమర్పించిన డిస్సెంట్ (అసమ్మతి) నోట్‌ను తొలగించారంటూ నిరసనకు దిగారు. సభలో పెద్ద ఎత్తున నినాదాలు చేశారు. దీంతో సభను చైర్మన్ జగదీప్ ధన్‌ఖర్ 20 నిమిషాల పాటు వాయిదా వేశారు. అనంతరం సభ ప్రారంభమైనప్పటికీ ప్రతిపక్షాలు తమ నిరసనను కొనసాగించాయి. ఈ నిరసనల మధ్యే ఈ నివేదికకు రాజ్యసభ ఆమోదం తెలిపింది. కాగా, జనవరి 29న ముసాయిదా నివేదికను జెపిసి ఆమోదించిన విషయం తెలిసిందే. బీజేపీ సభ్యులు సూచించిన 14 సవరణలను కమిటీ ఆమోదించింది. అయితే కాంగ్రెస్, డీఎంకే, టీఎంసీ, ఆప్, శివసేన(యూబీటీ), ఏఐఎంఐఎంతోసహా ప్రతిపక్ష సభ్యులు సూచించిన ప్రతి మార్పును కమిటీ తిరస్కరించింది. ఈ సవరణలతో వక్ఫ్‌బోర్డులలో ముస్లిమేతరులు కూడా సభ్యులుగా ఉంటారు. ఈ బిల్లుపై ముస్లింలు తీవ్రంగా వ్యతిరేకిస్తున్నప్పటికీ కేంద్ర ప్రభుత్వం పార్లమెంటులో ప్రవేశపెట్టి త్వరితగతిన ఆమోదింపజేసుకుంది.

# వల్లభనేని వంశీ అరెస్ట్..

అమరావతిఫిబ్రవరి 13 ఆంధ్ర ప్రగతి :

వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ నేత, మాజీ ఎమ్మెల్యే వల్లభనేని వంశీని పటమట పోలీసులు గురువారం అరెస్ట్ చేశారు. హైదరాబాద్ గచ్చిబౌలిలోని నివాసంలో వంశీని పోలీసులు అరెస్ట్ చేసి విజయవాడకు తరలించారు. కిడ్నాప్, దాడి, ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసుల్లో బీఎన్ఎస్ సెక్షన్లు 140(1), 308, 351(3), రెడ్ విత్ 3(5) కింద వంశీపై కేసులు నమోదు చేశారు. గత వైసీపీ ప్రభుత్వ హయాంలో గన్నవరం టీడీపీ కార్యాలయంపై జరిగిన దాడి కేసులో వంశీ ఏ-71గా ఉన్నారు. గన్నవరం టీడీపీ కార్యాలయంలో కంప్యూటర్ ఆపరేటరుగా సత్యవర్ధన్ పనిచేస్తున్నారు. కార్యాలయంపై దాడి కేసులో సత్యవర్ధన్ ఫిర్యాదుదారుడిగా ఉన్నారు. అతన్ని కిడ్నాప్ చేసి బెదిరించినట్టుగా వంశీపై ఆరోపణలున్నాయి. ఈ నేపథ్యంలో ఇటీవల విజయవాడలోని ఎస్సీ, ఎస్టీ కేసుల ప్రత్యేక



న్యాయస్థానంలో సత్యవర్ధన్ హాజరై తనకు ఈ కేసుతో సంబంధం లేదని అఫిడవిట్ సమర్పించారు. ఆ తర్వాత టీడీపీ కార్యాలయంపై దాడి కేసులో తనను బెదిరించి తప్పుడు వాంగ్మూలం ఇప్పించారని ఆయన పోలీసులకు ఫిర్యాదు చేశారు. దీంతో విజయవాడ అదనపు డీసీపీ కృష్ణ, సిబ్బంది హైదరాబాద్ చేరుకుని పోలీసులు అరెస్ట్ చేశారు. వంశీని అరెస్ట్ చేస్తున్నట్టుగా ఆయన భార్యకు పోలీసులు నోటీసులు ఇచ్చినట్టుగా తెలుస్తోంది. వైఎస్సార్ పార్టీ నాయకుడు వల్లభనేని వంశీ విచారణ కృష్ణలంక పోలీస్ స్టేషన్‌లో ముగిసింది. దాదాపు ఎనిమిది గంటల పాటు పోలీసులు వంశీని విచారించారు. విచారణలో సేకరించిన వివరాలతో రిమాండ్ రిపోర్టును సిద్ధం చేశారు. విచారణ అనంతరం వైద్య పరీక్షల నిమిత్తం విజయవాడ జీజీహెచ్ కు తరలించారు. వైద్యపరీక్షల అనంతరం న్యాయమూర్తి ఎదుట హాజరుపరచనున్నారు. వంశీని తమ రిమాండ్‌కు అప్పగించాలని పోలీసులు కోరనున్నారు. తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో పనిచేసిన సత్యవర్ధన్‌ను కిడ్నాప్ చేసి దాడి చేశారనే ఆరోపణలు వంశీపై ఉన్నాయి. అట్రాసిటీ చట్టం ప్రకారం నాన్‌బెయిలబుల్ సెక్షన్ల కింద పోలీసులు కేసు నమోదు చేశారు.

# ఎలక్ట్రానిక్స్, టెక్స్‌టైల్స్, ఫుట్‌వేర్ రంగాల అభివృద్ధికి తైవాన్ సహకారం

**(మొదటి పేజీ తరువాయి)**

సమావేశంలో ఎలక్ట్రానిక్స్, టెక్స్‌టైల్స్, ఫుట్‌వేర్ రంగాల అభివృద్ధికి తైవాన్ తీసుకొచ్చిన పాలసీలు, తీసుకున్న చర్యల గురించి నారా లోకేశ్ తైవాన్ ప్రతినిధుల బృందాన్ని అడిగి తెలుసుకున్నారు. ఆంధ్రప్రదేశ్‌లో ఏపీలో ఎలక్ట్రానిక్స్, టెక్స్‌టైల్స్, ఫుట్‌వేర్ రంగాల అభివృద్ధికి తీసుకొచ్చిన పాలసీలు, అనుమతుల దగ్గర నుండి ఉత్పత్తి ప్రారంభం వరకూ ప్రభుత్వం నుండి అందిస్తున్న సహకారం గురించి మంత్రి వివరించారు. స్పీడ్ ఆఫ్ డూయింగ్ పద్ధతిలో కంపెనీల ఏర్పాటుకు ప్రభుత్వం తీసుకుంటున్న చర్యల గురించి పలు ఉదాహరణలతో వివరించారు. 2014-19 వరకూ తిరుపతిలో ఎలక్ట్రానిక్స్ క్లస్టర్స్ ఏర్పాటు చేసి కల్పించిన మౌలిక సదుపాయాలు, అక్కడ ఏర్పాటైన అనేక కంపెనీలు తద్వారా వేలాదిగా యువతకు లభించిన ఉద్యోగ అవకాశాల గురించి తైవాన్ బృందం దృష్టికి తీసుకెళ్లారు.

ఎలక్ట్రానిక్స్, టెక్స్‌టైల్స్, ఫుట్‌వేర్ రంగాల్లో అనేక



అవకాశాలు ఉన్నాయి. లక్షలాది మంది యువతకు ఉద్యోగ అవకాశాలు వస్తాయి. అందుకే వీటిని ప్రాధాన్యత రంగాలుగా గుర్తించి పని చేస్తున్నామని నారా లోకేశ్ అన్నారు. తైవాన్‌లో ఉన్న అనేక కంపెనీలు ప్రపంచవ్యాప్తంగా విస్తరించాలనే ప్రణాళికలతో ఉన్నాయని, ఆ కంపెనీలు ఆంధ్రప్రదేశ్‌కు వచ్చేందుకు సహకారం అందించాలని లోకేశ్ కోరారు.

ఆయా కంపెనీలు సులభంగా కార్యకలాపాలు ప్రారంభించే విధంగా పూర్తి సహకారం అందిస్తామని మంత్రి లోకేశ్ భరోసా ఇచ్చారు. ఎలక్ట్రానిక్స్, టెక్స్‌టైల్స్, ఫుట్‌వేర్ ప్రత్యేక పార్కులు ఏర్పాటుకు సహకరించాలని మంత్రి కోరారు. ఏపీలో ఎలక్ట్రానిక్స్, టెక్స్‌టైల్స్, ఫుట్‌వేర్ రంగాల అభివృద్ధికి పూర్తి సహకారం అందిస్తామని తైవాన్ బృందం తెలిపింది. ఈ సమావేశంలో తైపేయి ఎకనామిక్ అండ్ కల్చరల్ సెంటర్ ఇన్ చెన్నై డైరెక్టర్ జనరల్ రిచర్డ్ చెన్, నెక్సస్ ఇండో కన్సల్టెన్సీ మేనేజింగ్ డైరెక్టర్ ఎరిక్ చాంగ్, ఏపీ ప్రభుత్వం తరపున ఎకనామిక్ డెవలప్‌మెంట్ బోర్డు సీఈఓ సాయికాంత్ వర్మ పాల్గొన్నారు

# తమిళనాడుకు చేరుకున్న పవన్ కళ్యాణ్

## స్వామిమలై క్షేత్రంలో స్వామినాథన్ దర్శనం







తంజావూరు,ఫిబ్రవరి 13 ఆంధ్ర ప్రగతి : దక్షిణ భారతదేశంలోని పుణ్యక్షేత్రాల పర్యటనలో ఉన్న ఏపీ డిప్యూటీ సీఎం, జనసేన అధినేత పవన్ కల్యాణ్.. తన పుణ్య క్షేత్ర యాత్రలో భాగంగా తమిళనాడు రాష్ట్రంలోని తంజావూరు చేరుకున్నారు. కుంభకోణం సమీపంలోని స్వామిమలై క్షేత్రానికి వెళ్లిన ఆయన.. శ్రీ స్వామినాథ స్వామిని దర్శించుకున్నారు.. స్వామిమలై శ్రీ స్వామినాథ స్వామి వారిని దర్శించుకున్న డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్.. షష్ట షణ్ముఖ క్షేత్ర యాత్రకు శ్రీకారం చుట్టారు. కంద షష్టి కవచ పారాయణంలో పాల్గొన్నారు.. ఆది ప్రణవనాదం ఓంకార మంత్ర రహస్యాన్ని సృష్టికి అందించిన క్షేత్రం.. షష్ట షణ్ముఖ క్షేత్రాల్లో ఐదవ క్షేత్రం స్వామిమలై.. ఆధ్యాత్మిక యాత్రలో భాగంగా గురువారం తంజావూరు సమీపంలోని స్వామిమలైని సందర్శించారు పవన్.. ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు, ఆలయ అర్చకులు కన్నన్ గురుకల్.. సంప్రదాయబద్ధంగా పూజలు చేశారు.. పంచ హారతులిచ్చారు.. ఆలయం చుట్టూ ప్రదక్షిణలు చేసి ధ్వజస్థంభానికి మొక్కారు పవన్ కల్యాణ్.. ఇక, స్వామినాథ స్వామికి అత్యంత ప్రీతిపాత్రమైన కంద షష్టి కవచ పారాయణంలో పాల్గొన్నారు పవన్.. ఆయన కుమారుడు అకీరా నందన్, తిరుమల తిరుపతి దేవస్థానం ట్రస్ట్ బోర్డు మెంబర్ ఆనంద్ సాయి ఈ క్షేత్రాన్ని దర్శించుకున్నారు.. స్వామినాథ స్వామి దర్శనానంతరం ఆలయంలో వెలసిన ఆదిదంపతులు సుందరేశ్వరన్ స్వామి, మీనాక్షి అమ్మవార్లకు ప్రత్యేక పూజలు నిర్వహించారు.. ఏపీ డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్‌కి డిప్యూటీ కమిషనర్ ఉమా దేవి ఆలయ మర్యాదలతో స్వాగతం పలికారు..

# తీర్పులకు..భేటీలకు సంబంధం ఉండదు

## వ్యవస్థల ఆధారంగానే పనితీరు ఉంటుంది -తీర్పుల్లో రాజకీయ జోక్యాలపై మాజీ సిజెఐ ఖండన

న్యూఢిల్లీ,ఫిబ్రవరి 13 ఆంధ్ర ప్రగతి : సుప్రీంకోర్టు తీర్పుల విషయంలో రాజకీయ జోక్యం ఉంటుందన్న ఆరోపణలను మాజీ సీజేఐ జస్టిస్ డీవై చంద్రచూడ్ తీవ్రంగా ఖండించారు. చట్ట ప్రకారమే రాజకీయ పార్టీల నేతలకు, కార్యకర్తలకు బెయిల్ ఇచ్చామని, గతేడాది 21,300 బెయిల్ పిటిషన్లు కొట్టేశామని గుర్తుచేశారు. మెజార్టీ వ్యక్తులకు అనుకూలంగా తీర్పులు ఉంటాయన్న ఆరోపణలను ఆయన ఖండించారు. గణపతి పూజ సందర్భంగా తమ ఇంటికి ప్రధాని మోదీ రావడంపై మాజీ సీజేఐ జస్టిస్ డీవై చంద్రచూడ్ మరోసారి స్పందించారు. భారత న్యాయ వ్యవస్థపై ప్రజలకు అచంచలమైన విశ్వాసం ఉందని సుప్రీంకోర్టు మాజీ ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ డీవై చంద్రచూడ్ స్పష్టం చేశారు. బీబీసీ నిర్వహించే హార్డ్ టాక్ కార్యక్రమంలో ఆ సంస్థ ప్రతినిధి స్టీఫెన్ సకూర్ అడిగిన పలు ప్రశ్నలకు జస్టిస్ డీవై చంద్రచూడ్ తనదైన శైలిలో సమాధానమిచ్చారు. అందులో ఆర్టికల్ 370 రద్దు నుంచి ఆయన ఇంట గణేష్ చతుర్థి వేడుకల్లో ప్రధాని మోదీ పాల్గొనడం వరకు అడిగిన అన్ని ప్రశ్నలకు జస్టిస్ చంద్రచూడ్ చాలా హుందాగా సమాధానమిచ్చారు.ప్రధాని మీకు బాగా సన్నిహితమా అని ఓ ఇంటర్వ్యూలో అడిగిన ప్రశ్నకు ఆయన స్పష్టమైన సమాధానం ఇచ్చారు. తమ వ్యవస్థ పరిణతితో వ్యవహరిస్తుందని బదులిచ్చారు. రాజ్యాంగపరం గా ఉన్నత పదవుల్లో ఉన్న ఇద్దరు వ్యక్తుల మధ్య మర్యాదపూర్వక భేటీని అతిగా చూడొద్దని సలహా ఇచ్చారు.. కేసుల తీర్పునకు ఇలాంటి మర్యాదలకు మధ్య సంబంధం లేదని అర్థం చేసుకొనే పరిణతి మా వ్యవస్థలో ఉందని మాజీ సీజేఐ వెల్లడించారు. ఎన్నికల బాండ్ల పథకాన్ని రద్దు చేసిన విషయాన్ని, ప్రభుత్వానికి వ్యతిరేకంగా వచ్చిన తీర్పులను ఆయన ప్రస్తావించారు. ఆర్టికల్ 370 రద్దుకు అనుకూలంగా తీర్పు ఇవ్వడాన్ని సమర్థించుకున్నారు. రాజ్యాంగం అసలు ఉద్దేశానికి



అనుగుణంగా ఆ తీర్పు ఉందన్నారు. ఈసందర్భంగా కశ్మీర్ ఎన్నికల అంశాన్ని ఉదహరించారు. 'జమ్మూకశ్మీర్‌కు సెప్టెంబరు 30, 2024లోగా అసెంబ్లీ ఎన్నికలు నిర్వహించాలని సుప్రీంకోర్టు డెడ్‌లైన్ విధించింది. ఇప్పుడు అక్కడ ప్రజాస్వామ్య యుతంగా ఎన్నుకొన్న ప్రభుత్వం అధికారంలోకి వచ్చింది. అధికార మార్పిడి కూడా శాంతియుతంగా జరిగిందని అంటూ సమాధానమిచ్చారు. ఇదిలాఉంటే, జస్టిస్ డీవై చంద్రచూడ్ సీజేఐగా ఉన్న సమయంలో ఆయన నివాసంలో నిర్వహించిన గణపతి పూజలో ప్రధానమంత్రి నరేంద్ర మోదీ పాల్గొన్న విషయం తెలిసిందే. మహారాష్ట్ర సంప్రదాయ టోపీ ధరించి పూజలో పాల్గొన్న ఫొటోలను ప్రధాని సామాజిక మాధ్యమ ఖాతాలో అప్పట్లో పోస్ట్ చేయడంపై విపక్షాలు విమర్శలు గుప్పించాయి. దీనిపై గతంలో జస్టిస్ డీవై చంద్రచూడ్ మాట్లాడారు. ప్రధానమంత్రి రావడంలో తప్పులేదన్న ఆయన.. అది బహిరంగ భేటీయేనని, వ్యక్తిగత సమావేశం కాదన్నారు. అధికార విభజన అంటే న్యాయవ్యవస్థ, కార్యనిర్వాహక వ్యవస్థలు సమావేశం కావద్దని, చర్చించవద్దని అర్థం కాదన్నారు. భారత న్యాయవ్యవస్థ.. ఉన్నత వర్గాలు, హిందూ అగ్రవర్ణ పురుషుల ఆధిపత్యంలో ఉందా.. అని స్టీఫెన్ సకూర్ ప్రశ్నకు జస్టిస్ చంద్రచూడ్ ఏకీభవించలేదు. దేశ న్యాయ వ్యవస్థకు మూలాధారమైన జిల్లా న్యాయ వ్యవస్థను ఓ సారి పరిశీలిస్తే.. దేశంలోని వివిధ రాష్ట్రాల్లో చేరే వారిలో 50 శాతానికి పైగా మహిళలు ఉన్నారన్నారు. అంతేకాదు.. దేశంలో 60 నుంచి 70 శాతం మేర.. మహిళలు చేరుతోన్నారని ఆయన వివరించారు. దేశంలో మహిళలకు సైతం న్యాయ విద్య చేరువైందని చెప్పారు. జిల్లా స్థాయి న్యాయ వ్యవస్థలో మహిళ సంఖ్య పెరుగుతోందన్నారు. అలాగే మహిళలు సైతంపైకి ఎదుగుతోన్నారని తెలిపారు. అదీకాక తన తండ్రి వైవీ చంద్రచూడ్.. తాను భారత ప్రధాన న్యాయమూర్తిగా ఉన్నంత కాలం న్యాయస్థానంలో అడుగు పెట్ట వద్దని తనతో చెప్పే వారని ఈ సందర్భంగా ఆయన గుర్తు చేసుకున్నారు. అందుకే తాను హార్వర్డ్ లా స్కూల్‌లో మూడు సంవత్సరాలు చదువుకొన్నానని తెలిపారు. అలా తన తండ్రి పదవీ విరమణ చేసిన అనంతరం తొలిసారిగా తాను కోర్టులో ప్రవేశించానని వివరించారు. దేశ న్యాయ వ్యవస్థను ఓ సారి పరిశీలిస్తే.. చాలా మంది న్యాయవాదులు, న్యాయమూర్తులు.. ఈ వృత్తిలోని తొలిసారి ప్రవేశించిన వారేరన్నారు. ప్రధాని మోదీ ప్రభుత్వ హయాంలో సుప్రీంకోర్టు చీఫ్ జస్టిస్‌గా మీరేమైనా రాజకీయ ఒత్తిళ్లను ఎదుర్కోవలసి వచ్చిందా? అంటూ అధికార బీజేపీ తన సొంత రక్షణ కోసం కోర్టుపై మొగ్గు చూపిందంటూ న్యూయార్క్ టైమ్స్ సంపాదకీయాన్ని బీబీసీ ప్రతినిధి సకూర్ ప్రశ్నించగా.. డీవై చంద్రచూడ్ సమాధాన మిస్తూ.. 2024లో జరిగిన సార్వత్రిక ఎన్నికల ఫలితాల్లో.. భారత్‌లో ఏకపక్షంగా ఉంటాయనే అపోహను తొలగించాయని చెప్పారు. ఆ క్రమంలో దేశంలోని రాష్ట్రాలను పరిశీలిస్తే.. చాలా రాష్ట్రాల్లో ప్రాంతీయ పార్టీలు ఉన్నాయన్నారు. అవి ఈ ఎన్నికల్లో ప్రభావం చూపాయి. అవి రాష్ట్రాలను సైతం పాలిస్తున్నాయని సోదాహరణగా వివరించారు. పరువు నష్టం కేసులో లోక్ సభలో ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీకి శిక్ష విధించడంపై ప్రశ్నించగా.. సుప్రీంకోర్టు తీర్పును ఆ తర్వాత పాజ్ చేసిందని తెలిపారు.

# ఒంగోలు గిత్తకు 41 కోట్లు...

## సిఎం చంద్రబాబు హర్షం

అమరావతి,ఫిబ్రవరి 13 ఆంధ్ర ప్రగతి :ప్రపంచ వేదికపై ఒంగోలు గిత్త తన సత్తా చాటిందని ముఖ్యమంత్రి చంద్రబాబు వ్యాఖ్యానించారు. అంతర్జాతీయ మార్కెట్‌లో ఒంగోలు గిత్త రూ.41కోట్లు పలకడం శుభపరిణామమన్నారు. రాష్ట్ర పశుసంవర్ధక వారసత్వం ప్రపంచానికి చాటిందని పేర్కొన్నారు. ఒంగోలు గిత్తలు ఉన్నత



జన్యువులు, బలానికి ప్రసిద్ధి చెందాయని తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం ఈ జాతిని పరిరక్షిస్తూ పాడి రైతులను ఆదుకోవడానికి కృషి చేస్తోందని వెల్లడించారు. ఇది తెలుగువారికి గర్వకారణమని సిఎం అన్నారు. ఈ జాతి పరిరోణకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలన్నారు. మిలమిల మెరిసే తెల్లటి శరీరం.. చలి, వేడిని తట్టుకునే శరీరతత్వం.. చూపరులను ఆకట్టుకునే మూపురం.. రంకెల్లో రాజసం.. ఒంగోలు జాతి పశువుల పేరెత్తగానే జంతు ప్రేమికుల కళ్లెదుట కదలాడే దృశ్యాలివి. అటువంటి వాటికి పుట్టినిల్లు ప్రకాశం జిల్లా. బ్రెజిల్‌లో ఇటీవల నిర్వహించిన వేలంలో ఒంగోలు జాతి గిత్త ఏకంగా రూ.41 కోట్ల ధర పలికింది.

# స్మార్ట్‌మీటర్లపై వివరణ ఇవ్వండి

## ఎస్పీడీసీఎల్ ఎండీకి మంత్రి గొట్టిపాటి ఆదేశాలు

అమరావతి,ఫిబ్రవరి 13 ఆంధ్ర ప్రగతి : నిబంధనలకు విరుద్ధంగా స్మార్ట్ మీటర్ల పరికరాల బిల్లులు చెల్లింపుపై ఎస్పీడీసీఎల్ ఎండీ సంతోష్‌రావును విద్యుత్‌శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్ వివరణ కోరారు. మీడియాలో వరుస కథనాలపై ముఖ్యమంత్రికి ఉన్న అసంతృప్తిని ఎండీకి వివరించారు. ప్రభుత్వానికి చెడ్డపేరు తెచ్చేలా కాకుండా, ముఖ్యమంత్రి ఆలోచనలకు అనుగుణంగా పనిచేయాలని మంత్రి స్పష్టం చేశారు. గురువారం సచివాలయంలో మంత్రిని ఎస్పీడీసీఎల్ ఎండీ కలిశారు. గ్రామాల్లో విద్యుత్ ప్రమాదాలు తగ్గాలని మంత్రి ఆదేశించారు. వేసవిలో విద్యుత్ కోతలు ఉండరాదన్నారు. కూటమి ప్రభుత్వం హామీ మేరకు రైతులకు 9 గంటల ఉచిత విద్యుత్ అందాలని ఆదేశించారు.



# రాష్ట్రంలో కక్షపూరిత రాజకీయాలు

## ప్రభుత్వ వైఫల్యాలపై మండలిలో ప్రశ్నిస్తా : బొత్స సత్యనారాయణ

అమరావతిఫిబ్రవరి 13 ఆంధ్ర ప్రగతి : :రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం కక్షపూరిత రాజకీయాలు చేస్తుందని, ఎప్పుడు అక్రమ కేసులు పెడదామా అని ఎదురుచూస్తుందని మాజీ మంత్రి బొత్స సత్యనారాయణ విమర్శించారు. వైఎస్సార్‌సీపీ నేత వల్లభనేని వంశీపై మాజీ మంత్రి బొత్స సత్యనారాయణ స్పందించారు. ఈ సందర్భంగా గురువారం ఆయన విశాఖలో మీడియాతో మాట్లాడుతూ.. వల్లభనేని వంశీ అరెస్టును తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు. కేసు వెనక్కు తీసుకుంటే



మళ్ళీ అరెస్టు చేయడం ఏంటని ప్రశ్నించారు. కక్ష పూరిత రాజకీయాలు చేయడం మంచి పద్ధతి కాదని.. ఇలాంటివి రాజకీయాలలో సరికాదని పేర్కొన్నారు. ఋషికొండ భవనాలు ప్రభుత్వ కట్టడాలు...నిర్మాణాలలో అక్రమాలు జరిగినట్లు నిర్ధారణ అయితే చర్యలు తీసుకోవాలన్నారు. కూటమి ప్రభుత్వ వైఫల్యాలను మండలిలో ప్రశ్నిస్తామని.. శాసనసభ విషయంలో పార్టీ వైఖరిని తమ వాళ్ళను అడిగి చెప్తానని.. తనకు తెలియని విషయాన్ని తెలుసుకొని చెప్తానని అనడంలో తప్పు లేదు కదా అని బొత్స అన్నారు. రాష్ట్రంలో నిత్యావసర వస్తువులు ధరలు పెరిగిపోతున్నాయని, పండగ కూడా బాగా చేసు కోలేకపోయారని బొత్స సత్యనారాయణ అన్నారు. ఇంకా వేసవి రాకుండానే పవర్ కట్స్ విధిస్తున్నారని, వైసీపీ హయంలో స్కూల్స్ మూసేసారని దుష్ప్రచారం చేశారని అన్నారు. ఇప్పుడు ఫైల్స్ క్లియరింగ్ ఎందుకు ఆలస్యం అవుతుందని స్వయంగా సీఎం చంద్రబాబు చెప్పారు కదా అని బొత్స ప్రశ్నించారు. ఇప్పటికీ ఒక సిలెండర్ మాత్రమే ఇచ్చారని...తల్లి కి వందనం ఇస్తామని అంటున్నారని.. రైతులను కూటమి ప్రభుత్వం ఆదుకోవడం లేదని, నిరుద్యోగ భృతి ఏమైందని నిలదీశారు. గత 5 ఏళ్లలో జరిగిన దాని కంటే..ఈ 9 నెలల్లో ఎక్కువ జరిగాయని ఆయన అన్నారు. ఈ ప్రభుత్వం మాటల ప్రభుత్వం తప్ప,.. చేతల ప్రభుత్వం కాదని విమర్శించారు. మండలిలో ప్రభుత్వ వైఫల్యాలను ప్రశ్నిస్తామన్నారు. గత టీడీపీ, వైసీపీ హయంలో భూకుంభకోణంపై వేసిన సిట్ నివేదికను బయట పెట్టాలని డిమాండ్ చేశారు.

# మోహన్ బాబుకు భారీ ఊరటనిచ్చిన సుప్రీంకోర్టు

**జర్నలిస్టుపై దాడి ఘటనలో మోహన్ బాబుపై హత్యాయత్నం కేసు**

**ముందస్తు బెయిల్ నిరాకరించిన తెలంగాణ హైకోర్టు**

**ముందస్తు బెయిల్ ఇచ్చిన సుప్రీంకోర్టు**

ఫిబ్రవరి 13 ఆంధ్ర ప్రగతి :పముఖ సినీ నటుడు మోహన్ బాబుకు సుప్రీంకోర్టులో పెద్ద ఊరట లభించింది. జర్నలిస్టుపై దాడికి సంబంధించి ఆయనపై హత్యాయత్నం కేసు నమోదైన సంగతి తెలిసిందే. ఈ కేసులో ఆయన ముందస్తు బెయిల్ కోరుతూ తెలంగాణ హైకోర్టును ఆశ్రయించారు. అయితే ఆయనకు ముందస్తు బెయిల్ ఇచ్చేందుకు హైకోర్టు నిరాకరించింది. దీంతో, ఆయన హైకోర్టు తీర్పును సుప్రీంకోర్టులో సవాల్ చేశారు. మోహన్ బాబు పిటిషన్ ను విచారించిన సుప్రీంకోర్టు ఆయనకు ముందస్తు బెయిల్ మంజూరు చేసింది. హైదరాబాద్ జల్ పల్లిలోని నివాసం వద్ద 2024 డిసెంబర్ 10న జర్నలిస్టుపై మోహన్ బాబు మైక్ తో దాడి చేసిన సంగతి తెలిసిందే. ఈ ఘటనకు సంబంధించి మోహన్ బాబుపై పహాడిషరీఫ్ పోలీసులకు బాధిత జర్నలిస్టు ఫిర్యాదు చేశారు. ఆ ఫిర్యాదు ఆధారంగా మోహన్ బాబుపై పోలీసులు కేసు నమోదు చేశారు.కేసు విచారణ సందర్భంగా కావాలని తాను జర్నలిస్టుపై దాడి చేయలేదని సుప్రీంకోర్టుకు మోహన్ బాబు తెలిపారు. కుటుంబ గొడవల నేపథ్యంలో ఒకరిపై మరొకరు ఫిర్యాదులు చేసుకున్నామని చెప్పారు. బాధిత జర్నలిస్టుకు నష్టపరిహారం ఇచ్చేందుకు కూడా సిద్ధంగా ఉన్నానని తెలిపారు.మోహన్ బాబు కుటుంబంలో కొంతకాలంగా గొడవలు జరుగుతున్నాయి. మోహన్ బాబు, ఆయన చిన్న కుమారుడు మంచు మనోజ్ ఒకరిపై మరొకరు ఫిర్యాదులు చేశారు. సంక్రాంతి సందర్భంగా తిరుపతిలోని మోహన్ బాబు యూనివర్శిటీ వద్ద కూడా హై డ్రామా నడిచింది. ఇరు పక్షాల బౌన్సర్లు కొట్టుకున్నారు. చివరకు పోలీసుల అనుమతితో క్యాంపస్ లోపల ఉన్న తన తాత, నానమ్మల సమాధులను మనోజ్ దర్శించుకుని బయటకు వచ్చారు.

# ఉచిత పథకాలపై కనువిప్పు కలిగేనా ?

ఫిబ్రవరి 13 ఆంధ్ర ప్రగతి :

ఉచిత పథకాలతో ప్రజలు సోమరులుగా మారి, పనిచేయడానికి ముందుకు రారని సుప్రీంకోర్టు చేసిన హెచ్చరిక, ప్రజలకు ముఖ్యంగా రాజకీయ నాయకులకు కనువిప్పు కావాలి. ప్రభుత్వం ద్వారా అన్నీ ఉచితంగా పొందాలనే మనస్తత్వం కారణంగా దేశంలో అభివృద్ధి కుంటుపడిపోతోంది. ఉచిత పథకాలతో ప్రభుత్వాలు అప్పులు చేస్తున్నాయి. లక్షల కోట్లు అప్పులు చేసి, వడ్డీలు కట్టలేక, జీతాలు చెల్లించలేక, కనీసం ఓ రోడ్డు కూడా సక్రమంగా వేయలేక చతికిల పడుతున్నాయి. దీనికితోడు ప్రభుత్వాలు కూడా దుబారా తగ్గించుకోవాలి. ఈ విషయంలో జాతీయస్థాయి చర్చ సాగాలి. ముఖ్యంగా అధికారంలోకి రావడానికి అనేక విధాలుగా ఉచిత పథకాలపై హామీలు గుప్పిస్తున్నారు. దీనిపై సుప్రీం ధర్మాసనం గట్టిగానే హెచ్చరించింది. ఇది పాటిస్తారా లేదా అన్నది చూడాలి. అయితే ఇలా ఎంతకాలం ఇస్తారన్నది ప్రజలు కూడా ఆలోచన చేయాలి. ఉచిత రేషన్, ఉచిత గ్యాస్, ఉచిత ఇల్లు, ఉచిత బియ్యం, ఉచితంగా పెన్షన్ , ఉచితంగా బస్సు ప్రయాణం.. ఇలా చెప్పుకుంటూ పోతే అనేక రకాలుగా ప్రజలు తమను తాము రాజకీయ నాయకులకు ఓట్లుగా అమ్ముకోబడుతున్నారు. ఇది ప్రజలకు మంచిది కాదు. రాజకీయ నాయకులు ఉచిత పథకాలను నిలదీయగలగాలి. రాజ్యాంగ పరంగా ఇలాంటి వాటిపైనా ఆంక్షలు ఉండాలి. ఎన్నికల సంఘం కూడా దీనిపై దృష్టి సారించాలి. సుప్రీం తీర్పు నేపథ్యంలో ఉచిత పథకాల పందేరాన్ని ఆపాలి. సంక్షేమం పేరుతో ప్రజలను చేష్టలుడిగేలా చేయడం సరికాదు. సంక్షేమం అవసరమే కానీ మోతాదు మించకుండా చూసుకోవాలి. ప్రజలకు స్వీట్ల మాదిరి ఉచితాలను పంచిపెడుతూ పోతే ఆధునిక భారత దేశం అంధకార యుగంలోకి జారిపోతుందని గతంలో ఓమారు ప్రధాని మోడీ సెలవిచ్చారు. ఉచితాలను అమలు చేస్తే ఎక్స్‌ప్రెస్ వేలు, విమానాశ్రయాలు, రక్షణ కారిడార్లను నిర్మించలేం అని ప్రధానమంత్రి నరేంద్రమోదీ 2022 జూలై 16న యూపీలో బుందేల్‌ఖండ్ ఎక్స్‌ప్రెస్ వేను ప్రారంభిస్తూ హెచ్చరించారు. ఆనాడు దీనిని అనేకులు విమర్శించారు. మోడీకి సంక్షేమం పట్ల శ్రద్ధ లేదన్నారు. అయితే మోడీ ఇలా చెప్పినప్పుడు పాటించివుంటే బాగుండేది. కానీ ఆ తర్వాత ఏడాదే మధ్యప్రదేశ్‌లో లాడ్లీ బెహనా పథకం క్రింద మహిళలకు నెలకు రూ.1250 చొప్పున చెల్లిస్తామని, క్రమంగా దాన్ని రూ. 3వేల వరకు పెంచుతామని బీజేపీ ప్రకటించింది. మొన్న మహారాష్ట్రలో కూడా ఇదేవిధంగా ఇలాంటి పథకాన్నే ప్రకటించారు. మధ్యప్రదేశ్‌లోనే కాదు, ఆ తర్వాత ప్రతి రాష్ట్రంలో జరిగిన ఎన్నికల్లో బీజేపీ ఉచితాల మీద ఉచితాలను ప్రకటిస్తూ ఎన్నికల్లో ప్రయోజనం పొందింది. దేశ రాజధాని ఢిల్లీ అసెంబ్లీ ఎన్నికల్లో బీజేపీ కనీవినీ ఎరుగని స్థాయిలో ఉచితాల హామీలను




ప్రకటించింది. దీన్నిబట్టి చూస్తే మోడీయేనా ఉచితాలను వ్యతిరేకించింది అని ఆశ్చర్యం కలుగక మానదు. ఉచిత పథకాలు వద్దనుకున్నప్పుడు అందుకు కార్యాచరణ చేయాలి. ప్రజలను ఉచిత ఊబిలో పడకుండా చేయాలి. అభివృద్ధితో వారిని ముందుకు తీసుకుని వెళ్లాలి. ఉచిత పథకాల సంస్కృతి కారణంగా దేశ, రాష్ట్రాల ఆర్థిక వ్యవస్థపై తీవ్ర ప్రభావం చూపుతోంది. ఖజానాపై విపరీతంగా భారం పడుతుందని ఆర్థికవేత్తలు హెచ్చరిస్తున్నారు. ఇది తెలిసినా ఏ రాజకీయ పార్టీ కూడా ఉచితాలను ప్రకటించేందుకు వెనుకాడడం లేదు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో 43 ఏళ్ల క్రితం ప్రారంభం అయిన కిలో రెండు రూపాయాల బియ్యం పథకాన్ని ఇప్పుడు కిలో రూపాయికే ఇవ్వడం వెనక సామాజిక ఉద్దరణ, పేదరిక నిర్మూలనకన్నా ఓట్ల బేరమే దాగివుంది. కిలో బియ్యం పథకం పెద్ద మాఫియాగా మారినా విజనరీ చంద్రబాబు చర్యలు తీసుకోవడం లేదు. ఉచితాలను సమర్థంగా అమలు చేస్తే అధికారంలోకి తప్పకుండా రాగలం అన్న నమ్మకంతో ఆమ్ ఆద్మీ పార్టీ రాజకీయ మొదలు పెట్టింది. మంచినీరు, విద్యుత్, ఆరోగ్యం, విద్య, మహిళలకు బస్సు ప్రయాణం, వృద్ధులకు తీర్థ యాత్ర.. ఇలా ప్రతి రంగంలోనూ ఉచితాలను ప్రవేశపెట్టి అమలు చేయడం ద్వారా 2013 నుంచి ఇప్పటి వరకూ ఆప్‌కు ఎన్నికల్లో తిరుగులేకుండా పోయింది. అంతకు మించి బిజెపి హామీలు ఇవ్వడంతో ఇప్పుడు ఢిల్లీలో కొట్టుకు పోయింది. ఎపిలో జగన్ సర్కార్ అన్నీ ఉచితాలే ప్రకటించింది. ప్రతిరోజూ ఏదో రూపంలో బటన్ నొక్కడమే పనిగా పెట్టుకున్నారు. అయినా ప్రజా తీర్పులో కొట్టుకు పోయారు. అయనేమీ నష్టపోలేదు. ఎపిని 7 లక్షల కోట్ల అప్పుల్లో ముంచారు. తెలంగాణలో కెసిఆర్ కూడా దాదాపు ఇలాగే పథకాలు ప్రకటించి తనకు తిరుగులేదని నిరూపించుకున్నారు. ఆయనా కొట్టుకుపోయారు. ఇప్పుడు కాంగ్రెస్ కూడా ఉచిత బస్సు మొదలు అనేక పథకాలను కొనసాగి స్తోంది. ఆదాయం వడ్డీలకే సరిపోవడం లేదని రేవంత్ ప్రభుత్వం వాపోతోంది. అయినా సమీక్షించుకునే ధైర్యం చేయడం లేదు. నగదు బదిలీల వల్ల ప్రజల వినియోగ సామర్థ్యం పెరిగి ఆర్థిక వ్యవస్థకు ఎంతో కొంత తోడ్పడుతుందనే వాదన ఒకటి ఉన్నది. అయిత నిరుత్పాదక వ్యయం వల్ల జరిగే నష్టాలు అన్నీ ఇన్నీ కావు. ప్రజలకు చేతినిండా పని కల్పించలేని ప్రభుత్వాల అసమర్థత వల్ల ఆర్థిక వ్యవస్థకు ఎంత మేరకు నష్టం జరుగుతుందో, దాని వల్ల సమాజంలో జరిగే నష్టాలు ఎన్నో కూడా ఊహించవచ్చు. కొందరికి లభించే ఉచితాల కోసం జిఎస్టీ లాంటి పన్నుల రూపంలో మరికొందరు చెల్లించాల్సి వస్తుంది. వేలకోట్లు బ్యాంకులకు అప్పులు బాకీపడిన, విదేశాలకు పరారైన, కోట్ల రూపాయలు పన్నులు ఎగ్గొట్టిన, రాజకీయ పార్టీలకు నిధులు సమకూర్చిన సంపన్నులు మాత్రం ఈ ఉచితాలను భరించడం లేదన్నది మాత్రం వాస్తవం. ఉచిత పథకాలతో ప్రజల్లో కష్టపడే తత్వం పోతోందని, వారు పనులకు దూరంగా ఉంటున్నారని, రాజకీయ పార్టీల ఉచిత పథకాలను ఉద్దేశిస్తూ సుప్రీంకోర్టు కీలక వ్యాఖ్యలు చేసింది. ఎన్నికల సమయంలో ఆయా రాజకీయ పార్టీలు ఉచితాలను ప్రకటించే పద్ధతి మంచి కాదని వ్యాఖ్యానించింది. ఉచిత పథకాలు మంచివి కావు. దురదృష్ట వశాత్తూ.. వీటి కారణంగా ప్రజలు కష్టపడి పని చేసేందుకు ఇష్టపడడం లేదు. ఉచితంగా రేషన్, డబ్బులు అందుతున్నాయి. ఎలాంటి పని చేయకుండానే డబ్బులు వస్తుండటంతోనే ఇలా జరుగుతోంది. ప్రజలకు సౌకర్యాలు అందించాలన్న ప్రభుత్వాల ఉద్దేశం మంచిదే. కానీ, వారిని దేశ అభివృద్ధిలో భాగం చేయాలే తప్ప సోమరులను కాదన్న రీతిలో వ్యాఖ్యానించింది. ఎన్నికల్లో ఉచిత పథకాలు ప్రకటించే పద్ధతి సరైనది కాదని జస్టిస్ బీఆర్.గవాయ్, జస్టిస్ అగస్టిన్ జార్జ్ మాసిహ్‌తో కూడిన ధర్మాసనం వ్యాఖ్యానించింది. ఈ సందర్భంగా అయినా ప్రధాని మోడీ ఉచిత పథకాలకు అడ్డుకట్ట వేసేలా ముందుకు రావాలి. ఎక్కడో ఒకచోట్ దీనికి ముగింపు పలికితే మంచిది.

## జనసేన పార్టీలో చేరిన రోటరీ క్లబ్ మాజీ అధ్యక్షుడు సుధా మోహన్ రెడ్డి



ఆంధ్ర ప్రగతి నంద్యాల ఫిబ్రవరి 13: జనసేన పార్టీ ఉమ్మడి కర్నూలు జిల్లాల కోఆర్డినేటర్ చింత సురేష్ బాబు, నంద్యాల జనసేన పార్టీ సమన్వయకర్త పిడతల సుధాకర్ సమక్షంలో రోటరీ క్లబ్ మాజీ అధ్యక్షుడు సుధా మోహన్ రెడ్డి కర్నూల్ జనసేన పార్టీ కార్యాలయంలో జనసేన పార్టీ లో చేరారు. చింత సురేష్ బాబు జనసేన పార్టీ కండువా కప్పి పార్టీలోకి సాధారంగా ఆహ్వానించారు. ఈ సందర్భంగా సుధా మోహన్ రెడ్డి మాట్లాడుతూ జనసేన పార్టీ ప్రజా సంక్షేమానికి అత్యంత ప్రాధాన్యత ఇస్తోందని, జనసేన సిద్ధాంతాలను ప్రజల్లోకి తీసుకెళ్లి సామాజిక సేవ ద్వారా మార్పులు తెస్తానని అన్నారు. గత కొన్ని సంవత్సరాల నుంచి రోటరీ క్లబ్ తో పాటు ఆరోగ్య , విద్యా, క్రీడ రంగాలలో హోదాల్లో పనిచేసి సేవా కార్యక్రమాలు నిర్వహించారు. రామ్ చరణ్ నంద్యాల జిల్లా అధ్యక్షులు పబ్బతి రవి, నందిగాళ్ళ సందీప్, వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.

## రావూస్ జేఈఈ ర్యాంకర్స్ లను అభినందించిన మంత్రి ఎన్ఎండి ఫరూక్.





ఆంధ్ర ప్రగతి నంద్యాల ఫిబ్రవరి 13:
ఇటీవల ఎన్ టిఏ వారు ప్రకటించిన 2025 జేఈఈ మెయిన్స్ ఫేస్ 1 లో ఫలితాలలో నంద్యాలలో అధిక సీట్లు సాధించి , పర్సంటేజ్ సాధించిన రావూస్ విద్యార్థులను రాష్ట్ర న్యాయ మరియు మైనార్టీ సంక్షేమ శాఖ మంత్రి ఎన్ఎండి ఫరూక్ అభినందించారు. అత్యధిక పర్సంటేజ్ సాధించిన బి.పూర్ణేష్ రావు 98.059 , కేఎస్ సహస్ర 97.757 , జి శ్రావ్య 96.411 , ఎస్ సభా 95.065 లను సన్మానించడం జరిగింది. ఇంతటి ఫలితాలను సాధించిన కళాశాల యాజమాన్యానికి జేఈఈ అధ్యాపకులకు, తల్లిదండ్రులను అభినందించడం జరిగినది . ఈ సందర్భంగా విద్యార్థులను ఘనంగా మంత్రి ఫరూక్ సన్మానించడం జరిగింది. ఈ కార్యక్రమంలో కళాశాల డైరెక్టర్ ఏ మౌని చంద్ర , ప్రిన్సిపల్ సుంకన్న , జేఈఈ అధ్యాపకులు, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

## శివ నాగిరెడ్డి ఆధ్వర్యంలో పరుగులు పెడుతున్న అభివృద్ధి పనులు.



ఆంధ్ర ప్రగతి నంద్యాల ఫిబ్రవరి 13 ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర న్యాయశాఖ మరియు మైనార్టీ సంక్షేమ శాఖ మంత్రి ఎన్ ఎండి ఫరూక్ ఆదేశానుసారము నంద్యాల జిల్లా తెలుగుదేశం పార్టీ ప్రధాన కార్యదర్శి ఎన్ఎండి ఫిరోజ్ అన్న, ఆంధ్ర రాష్ట్ర తెలుగుదేశం పార్టీ యువ నాయకులు ఎన్ఎండి ఫయాజ్ అన్న ఆధ్వర్యంలో నందమూరి నగర్, వైయస్సార్ నగర్ 38 వార్డ్ ఇంచార్జ దేరెడ్డి శివనాగిరెడ్డి స్వీయ పర్యవేక్షణలో వైయస్సార్ నగర్ నందు కచ్చా కాలువలు తీయించడం జరిగింది. బాత్రూమ్ నీళ్ల వర్షపు నీళ్లు రోడ్లమీద ఉండటం పాదాచారులకు తీవ్ర ఇబ్బందులు కలుగుతున్నందువల్ల రోడ్డుకు ఇరువైపులా కచ్చా కాలువల ద్వారా మురుగు నీటిని బయటికి పంపడం జరుగుచున్నది. అందుకుగాను వార్డు ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు. ఎన్ఎండి ఫిరోజ్ అన్న కు, ఫయాజ్ అన్నకు కృతజ్ఞతలు 38వ వార్డు ఇంచార్జ్ దేరెడ్డి శివనాగిరెడ్డి కృతజ్ఞతలు తెలిపారు.

## మంత్రి ఫరూక్ ని ఘనంగా సత్కరించిన ఇస్తేమా కమిటీ సభ్యులు.



ఆంధ్ర ప్రగతి నంద్యాల ఫిబ్రవరి 13: ఇటీవల జనవరి7,8,9వ తేదీల్లో జరిగిన ఆత్మకూరు ఇస్తేమా నిర్వహణకు ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, మంత్రి ఎన్.ఎం.డి ఫరూక్ శ్రీశైలం ఎమ్మెల్యే శ్రీ బుడ్డా రాజశేఖరరెడ్డి సహకారంతో ప్రభుత్వం నుంచి రూ.2 కోట్లు మంజూరు చేయించి, అన్ని ప్రభుత్వ శాఖల సమన్వయంతో ఇస్తేమాను విజయవంతం అయ్యేందుకు అన్ని విధాలుగా సహకరించినందుకు కృతజ్ఞతలు తెలిపిన ఇస్తేమా కమిటీ సభ్యులు నూర్ బేగ్, రజాక్, ఇంజనీర్ ఇషాక్, షాలి పహిల్వాన్,మరియు మత పెద్దలు చాబోలు ఇలియాజ్, సామిల్ గఫార్, మహబూబ్ జైలాన్,మీర్ మూర్తుజా , ముత్తు, లియాఖట్ అలీ,మూర్తుజా బేగ్, అనస్,మునీర్, వాహిద్ బేగ్, తదితరులు ఇస్తేమా దిగ్విజయంగా పూర్తి కావడానికి విశేష కృషి చేసిన జిల్లా కలెక్టర్, ఎస్పీ, ఇతర అధికారులను, సిబ్బందిని, ఇస్తేమా కమిటీ సభ్యులను మంత్రి ఎన్ఎండి ఫరూక్ అభినందించారు.

## కానాలలో పేదల ఇళ్లను లాక్కునేందుకు కూటమి నేతల దౌర్జన్యం

### -న్యాయం చేయాలంటూ రోడ్కెక్కిన బాధితులు.





ఆంధ్ర ప్రగతి నంద్యాల ఫిబ్రవరి13:
అర్హులైన పేదలకు ఆనాటి ప్రభుత్వాలు ఇళ్ల స్థలాలను కేటాయించడం జరిగింది. ఇందిరమ్మ ఇళ్లు, జగనన్న కాలనీలో దాదాపుగా 650 మంది అర్హులైన లబ్ధిదారులకు 1.5సెంట్ల ఇళ్ల స్థలాలను కేటాయించడం జరిగింది.అయితే లబ్ధిదారులు చాలీచాలని జీవితంతో కుటుంబాన్ని పోషించుకుంటూ ఆర్థిక పరిస్థితి మెరుగైన పరిస్థితిలో ఇళ్ల నిర్మాణాలను చేపట్టేందుకు ఉండగా కూటమి ప్రభుత్వంలో టీడీపీ నేతలు తమకు కేటాయించిన స్థలాలను కాజేసేందుకు పన్నాగం పన్ని ఇళ్ల స్థలాలను ఖాళీ చేయాలని, లేకపోతే కూలగొడతామని దౌర్జన్యానికి దిగారంటూ గురువారం కానాల గ్రామంలోని లబ్ధిదారుల కుటుంబాలు వందలాదిగా రోడ్డునెక్కారు. తమకు కేటాయించిన స్థలాలను లాక్కోవద్దని, తమకు కేటాయించిన వాటిని తమకే ఉండేలా చర్యలు తీసుకోవాలని, అలాగే ఇళ్ల నిర్మాణానికి ఆర్థికంగా ప్రభుత్వం సాయం అందించాలని కోరుతూ జిల్లా కలెక్టర్ ను బాధితులు కలవడం జరిగింది.ఆర్ అండ్ బి గెస్ట్ హౌస్ దగ్గర కార్లో వెళుతున్న న్యాయశాఖ మంత్రి ఎన్ఎండీ ఫరూక్ ను బాధితులు అడ్డుకోవడంతో తమ కార్యాలయానికి రావాలని కోరగా అక్కడికి పెద్ద ఎత్తున్న తరలి వెళ్లి వెళ్లడంతో అక్కడ ఉన్న కొందరు టిడిపి నాయకులు పోలీసులు లోపలికి అనుమతించకపోవడంతో మహిళలందరూ రోడ్డుపైనే బయటాయించి తమకు న్యాయం చేయాలని వేడుకున్నారు. చాలాసేపు తర్వాత మంత్రి ఎన్ ఎం డి ఫరూక్ బాధితులతో మాట్లాడడం జరిగింది.
సంవత్సరం కాలంలోనే కూటమి ప్రభుత్వం పేదల ఇళ్ల స్థలాలను గుంజుకోవడానికి దుర్మార్గమైన చర్యలను చేస్తుండటాన్ని ప్రజలు తప్పుపడుతున్నారు. కులమతాలకు, రాజకీయాలకు అతీతంగా అర్హులైన పేదలకు ఇచ్చిన ఇళ్ల స్థలాల వద్ద ఎటువంటి మౌలిక సదుపాయాల కల్పించలేక పోగా ఇచ్చిన స్థలాలపై కన్నేయడం దారుణం అని గ్రామస్తులు అంటున్నారు.

## శ్రీ వాసవి హైస్కూల్ 15 వ వార్షికోత్సవం కార్యక్రమంలో పాల్గొన్న ఎన్ఎండి ఫయాజ్.







ఆంధ్ర ప్రగతి నంద్యాల ఫిబ్రవరి 13:
నంద్యాల పట్టణంలోని నూనెపల్లె లో ఉన్న శ్రీ వాసవి హైస్కూల్ 15వ వార్షికోత్సవం స్కూల్ అధినేత వాసవి దస్తగిరి ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో ముఖ్య అతిథులుగా టిడిపి రాష్ట్ర యువ నాయకులు ఎన్ఎండి ఫయాజ్ , రామకృష్ణ విద్యా సంస్థల అధినేత శ్రీ రామకృష్ణా రెడ్డి, మునిషిఫల్ చైర్ పర్సన్ శ్రీమతి మాబున్నిసా, రిటైర్డ్ మెడికల్ సూపరిందేంట్ బాబన్ పాల్గొనడం జరిగింది.
ఈ సందర్భంగా ఎన్ఎండి ఫయాజ్ మాట్లాడుతూ వాసవి స్కూల్ నిర్మించి 15 సంవత్సరాలు పూర్తయిన సందర్భంగా మొదటగా కరస్పాండెంట్ దస్తగిరి గారికి వారి బృందానికి ధన్యవాదాలు తెలియజేశారు అలాగే విద్యార్థులు ఒత్తిడికి లోన్ కాకుండా విద్యనభ్యసించాలన్నారు. విద్యార్థులు బాగా చదివి స్కూల్ కి తల్లిదండ్రులకు సమాజానికి మంచి పేరు తీసుకురావాలని తెలిపారు. అనంతరం చిన్నారులు భరత మాత, ఝాన్సి రాణి, అల్లూరి సీతారామరాజు, దుర్యోధన ఏకపాత్రలు అందరినీ ఆకట్టుకున్నాయి. పెళ్లికూతురుని అత్త వారింటికి పంపే ఘట్టాన్ని గేయనాటిను స్వయంగా కరస్పాండెంట్ శ్రీ వాసవి దస్తగిరి పాడగా అందరూ కంట తడి పెట్టడం జరిగింది. విద్యార్థుల వివిధ సాంస్కృతిక కార్యక్రమాలు అందరినీ ఆకట్టుకున్నాయి. అనంతరం విద్యార్థినీ విద్యార్థులకు బహుమతులు అందజేశారు. ముఖ్య అతిథులను వాసవి స్కూల్ బృందం సత్కరించడం జరిగింది ఈ కార్యక్రమంలో వివిధ స్కూల్స్ కరస్పాండెంట్ , విద్యార్థుల తల్లిదండ్రులు , స్కూల్ అధ్యాపక బృందం పాల్గొనటం జరిగింది.

## శివాలయంకు ఆంప్లీ ప్లేయర్ ని విరాళంగా ఇచ్చిన తాటికొండ బుగ్గరాముడు.



ఆంధ్ర ప్రగతి నంద్యాల ఫిబ్రవరి 13: నంద్యాల టౌన్ స్థానిక 38వ వార్డు వై.యస్.ఆర్ నగర్ నందు గల శివాలయం కి మాహా శివరాత్రి పండుగ పర్వదినాన్ని పురస్కరించుకొని భక్తి పాటలు, భజన చేసుకోవడానికి ఉపయోగకరంగా ఉంటుంది అని ఆంప్లీ ప్లేయర్ ని విరాళంగా ఇచ్చిన వార్డు టిడిపి ఇంచార్జ్ తాటికొండ బుగ్గరాముడు ఈ కార్యక్రమంలో ఉమాకాంతయ్య,నారాయణ, రమణ,జాఫర్ తదితర వార్డు టిడిపి నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

## జాబ్ మేళా ను సద్వినియోగం చేసుకోండి

### టిడిపి రాష్ట్ర యువ నాయకులు ఎన్ఎండి ఫిరోజ్.



ఆంధ్ర ప్రగతి నంద్యాల ఫిబ్రవరి 13:
గ్రామీణ , పట్టణ ప్రాంతాల్లో ఉన్న నిరుద్యోగ యువతీ , యువకులకు ఉపాధి అవకాశాలు కల్పించడమే లక్ష్యంగా నంద్యాలలో ఫిబ్రవరి 14 వ తేదీ ఉదయం 9 గం.లకు స్థానిక బొమ్మల సత్రం గవర్నమెంట్ డిగ్రీ కాలేజ్ నందు జాబ్ మేళాను నిర్వహించడం జరుగుతుందని టిడిపి రాష్ట్ర యువ నాయకులు ఎన్ఎండి ఫిరోజ్ తెలిపారు.ఈ సందర్భంగా తెలుగుదేశం పార్టీ కార్యాలయం నందు జాబ్ మేళాకు సంబంధించిన పోస్టర్ ను డిస్టిక్ స్కిల్ డెవలప్మెంట్ ఆఫీసర్ శ్రీకాంత్ రెడ్డి , ప్లేస్మెంట్ ఆఫీసర్ సుబ్బన్న , 36 వ వార్డు టిడిపి ఇంచార్జ్ మారుతి ప్రసాద్ స్కిల్ డెవలప్మెంట్తో కోఆర్డినేటర్ మస్తాన్ వలి తో కలిసి టిడిపి రాష్ట్ర యువ నాయకులు ఎన్ఎండి ఫిరోజ్ పోస్టర్లను రిలీజ్ చేశారు.ఈ సందర్భంగా ఎన్ఎండి ఫిరోజ్ మాట్లాడుతూ నంద్యాల నియోజకవర్గ మరియు చుట్టుపక్కల ప్రాంతాల నిరుద్యోగ యువతీ యువకులకు నిర్వహించిన జాబ్ మేళాను సద్వినియోగం చేసుకోవాలన్నారు. 5 కంపెనీలు జాబ్ మేళాలో పాల్గొనబోతున్నాయని, దాదాపు 80 ఉద్యోగ అవకాశాలు కల్పిస్తున్నాయన్నారు. నిరుద్యోగులు నిరుత్సాహ పడాల్సిన అవసరం లేదని ప్రతి నెల జాబ్ మేళాను నిర్వహించడం జరుగుతుందన్నారు . 20 లక్షల ఉద్యోగాలు ఐదు సంవత్సరాలలో ఇవ్వాలనేదే తెలుగుదేశం పార్టీ ఆశయమన్నారు. ఈ ఆశయానికి అనుగుణంగా మంత్రివర్యులు నారా లోకేష్ సారథ్యంలో ఖచ్చితంగా సాధిస్తామని ప్రతి నిరుద్యోగికి ఉద్యోగ అవకాశం కల్పించే బాధ్యత తీసుకుంటామన్నారు అలాగే నాకు తెలిసిన హైదరాబాద్ కంపెనీస్ కూడా నంద్యాలకు తీసుకుని వచ్చి జాబ్ మేళా నిర్వహిస్తామని ఈ సందర్భంగా తెలియజేశారు.

## ఘనంగా సరోజినీ నాయుడు జయంతి వేడుకలు.




ఆంధ్ర ప్రగతి ఆళ్లగడ్డ ఫిబ్రవరి 13:
భారత కోకిల భారత స్వాతంత్ర్య మహిళా సమరయోధురాలు స్వతంత్ర భారత తొలి మహిళా గవర్నర్ సరోజినీ నాయుడు 146వ జయంతిని పురస్కరించుకొని జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా అపుస్మా ఆళ్లగడ్డ నియోజకవర్గం యూనిట్ ఆధ్వర్యంలో అపుస్మా ఆళ్లగడ్డ నియోజవర్గం అధ్యక్షులు టి అమీర్ భాష ఆధ్వర్యంలో ఆళ్లగడ్డ టౌన్ లోని పాలసాగరంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ప్రధానోపాధ్యాయులు బి మురళీధర్ ఆధ్వర్యంలో ఉపాధ్యాయ బృందం విద్యార్థి బృందం తో కలిసి సరోజినీ నాయుడు గారి చిత్రపటానికి పూలమాల అర్పించి సరోజినీ నాయుడు కి జై భారత్ మాతాకీ జై జై భారత్ వందేమాతరం అంటూ నినాదాలతో దేశభక్తిలో స్ఫూర్తిగా నిలిచారు ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయ బృందం యు నాగరాజు కే స్వర్ణ యు సుందరమ్మ జి పద్మావతమ్మ కే ప్రసాద్ జై మహమ్మద్ రఫీ కే సంజీవ రాయుడు కే లక్ష్మిరెడ్డి టీ దస్తగిరెడ్డి బి బాబు ఎస్ భారతి పాల్గొన్నారు.

## మాజీ ఎమ్మెల్యే అబ్బయ్యచౌదరి, ఎమ్మెల్యే చింతమనేని ప్రభాకర్‌కు మధ్య ముదురుతున్న వివాదం

అమరావతి,ఫిబ్రవరి 13 ఆంధ్ర ప్రగతి :దెందులూరు వైసీపీ మాజీ ఎమ్మెల్యే అబ్బయ్య చౌదరి, టీడీపీ ఎమ్మెల్యే చింతమనేని ప్రభాకర్ మధ్య వివాదం మరింత ముదురుతోంది. వట్లూరులోని ఓ ఫంక్షన్ హాల్లో వీరి మధ్య రాజుకున్న వివాదం నియోజకవర్గ స్థాయి దాటి రాష్ట్రస్థాయిలో పొలిటికల్ హాట్ టాపిక్‌గా మారింది. ఇప్పటికే గన్నవరం మాజీ ఎమ్మెల్యే, వైసీపీ నేత వల్లభనేని వంశీ అరెస్టు పెను సంచలనం సృష్టిస్తోంది. కాగా, ప్రస్తుతం ఏలూరు జిల్లాలో వైసీపీ, టీడీపీ నేతల మధ్య ఘర్షణ వాతావరణం సైతం ఉత్కంఠ రేకెత్తిస్తోంది. ఈ సందర్భంగా ఎమ్మెల్యే చింతమనేని మాట్లాడుతూ..కొంతమంది తమ ఉనికి కాపాడుకోవడానికి సంచలనాలు సృష్టించేందుకు ప్రయత్నిస్తున్నారు.

ప్రతి అక్షరం ప్రజాహితం
ఆంధ్రప్రగతి
తెలుగు దినపత్రిక


# ఆలయాల పాలకమండలి ఏర్పాటుకు రంగం సిద్ధం




**ఆంధ్ర ప్రగతి మహానంది ఫిబ్రవరి 13:**
పలు ఆలయాలకు సంబంధించి పాలకమండలి ఏర్పాటుకు రంగం సిద్ధమైనట్లు విశ్వాసనీయ సమాచారం. మహానంది దేవస్థానం తో పాటు, సూర్య నంది, కృష్ణ నంది మరియు వివిధ గ్రామాల్లోని గ్రూప్ టెంపుల్ ఆలయాలకు సంబంధించి పాలకమండలి నియామకం కొరకు రహస్యంగా చర్చలు జరుగుతున్నట్లు తెలుస్తుంది. గ్రూపులుగా ఏర్పడి మా వారికి కావాలంటే కాదు మా వర్గం వారికి కావాలని ఒక నాయకుని వద్ద చెవిలో జోరీ గల్లా చాట భారతం వినిపిస్తున్నట్లు తెలుస్తుంది. ఇవి అన్ని కావు గ్రామాల్లో మీరు చర్చించుకుని పేర్లను త్వరలో సిద్ధం చేసి వివరాలు అందజేయాలని అ నాయకుడు సూచించినట్లు తెలిసింది. గ్రామాల్లోని గ్రూప్ టెంపుల్లో చైర్మన్ పదవి కొరకు తీవ్ర పోటీ నెలకొన్నట్టు సమాచారం. మహానంది దేవస్థానం పాలక మండలికి సంబంధించి చైర్మన్ మరియు మండల సభ్యుల పదవులపై తీవ్ర పోటీ నెలకొనడంతో పాటు వర్గాలుగా విడిపోయి పదవులు దక్కించుకోవడానికి పావులు కదుపుతున్నట్లు సమాచారం. ఉగాది పర్వదిన అనంతరం గ్రూప్ టెంపుల్ లకు సంబంధించి పాలక మండళ్లు ఏర్పాటు అయ్యే అవకాశం ఉన్నట్టు సమాచారం. మహానంది ఆలయానికి సంబంధించి చైర్మన్ మరియు సభ్యుల ఏర్పాటు ఆలస్యం అవుతుందా లేక చిన్న పెద్ద ఆలయాలు అని తేడా లేకుండా ఒకేసారి పాలక మండలి ఏర్పాటు చేస్తారా అనేది తెలియాల్సి ఉంది.

## మాజీ ఇక్రా పాఠశాలలో ఉర్దూ జూనియర్ కళాశాలను కొనసాగించాలి.

**-ఉర్దూ జూనియర్ కళాశాల సొంత భవనం నిర్మించేంతవరకు పోరాటం కొనసాగిస్తాం.**






ఆంధ్ర ప్రగతి నంద్యాల ఫిబ్రవరి 13:
నంద్యాల పట్టణంలో గత ఏడు సంవత్సరాలుగా మైనార్టీ ఉర్దూ జూనియర్ కళాశాలకు సొంత భవనాలు లేకపోవడం దారుణమని పిడిఎస్.యు రాష్ట్ర అధ్యక్షులు ఎస్ ఎం డి. రఫీ విమర్శించారు. శుక్రవారం నాడు పత్రిక ప్రకటన విడుదల చేశారు. ఈ సందర్భంగా పి.డి.ఎస్.యు రాష్ట్ర అధ్యక్షులు ఎస్ఎండి.రఫీ, జానో జాగో నేషనల్ సెక్రెటరీ సయ్యద్ మహబూబ్ బాషా మాట్లాడుతూ నంద్యాల పట్టణంలో మైనార్టీ ఉర్దూ కళాశాల ఏర్పడి ఏడు సంవత్సరాలు దాటిన నేటికీ సొంత భవనం లేక ప్రభుత్వ మహిళా జూనియర్ కళాశాలలో కేవలం రెండు గదులలో ఉర్దూ జూనియర్ కళాశాల నడపడం దారుణం అన్నారు. 2018లో నంద్యాల లో ఉర్దూ జూనియర్ కళాశాల మంజూరు చేయడం జరిగింది. నంద్యాల చుట్టుపక్కల పరిసరాలలో మైనార్టీ జనాభా ఎక్కువగా ఉండడంతో నాటి ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు హయంలో నంద్యాల పట్టణానికి ఉర్దూ జూనియర్ కళాశాల మంజూరు అయింది. నేడు నంద్యాల చెందిన ఆంధ్ర ప్రదేశ్ మైనారిటీ శాఖ మంత్రి ఫరూక్ మంత్రి పదవి ఇవ్వడంతో మైనార్టీ ప్రజలు ఆశ భావం వ్యక్తం చేస్తున్నారు. కావున ఇప్పటికైనా రాష్ట్ర ప్రభుత్వం మైనారిటీ శాఖ మంత్రి ఫరూక్ చొరవ చూపి ఉర్దూ జూనియర్ కళాశాలను నంద్యాల నడిబొడ్డున ఉన్న బాలాజీ కాంప్లెక్స్ వక్ఫ్ బోర్డ్ స్థలంలోని మాజీ ఇక్రా పాఠశాలలో ఉర్దూ జూనియర్ కళాశాలను కొనసాగించాలని డిమాండ్ చేశారు. సొంత భవనం లేక రెండే గదులలో ఇబ్బందులు ఎదుర్కొంటున్నటువంటి మైనార్టీ విద్యార్థులకు శాశ్వత భవనంగా, ఈ భవనాన్ని కేటాయించేందుకు రాష్ట్ర ప్రభుత్వం కృషి చేయాలని డిమాండ్ చేశారు. అలాగే ఉర్దూ జూనియర్ కళాశాలలో ల్యాబ్ అసిస్టెంట్లు తగిన సిబ్బందిని నియమించాలని కోరారు. ఈ రౌండ్ టేబుల్ సమావేశానికి ఇన్సాఫ్ రాష్ట్ర నాయకులు బాబా ఫక్రుద్దీన్ మొదలైన నాయకులు పాల్గొన్నారు.

## కానాల ప్రజలను అన్ని విధాలుగా ఆదుకుంటాం.

**-రాష్ట్ర మంత్రి ఎన్ఎండి ఫరూక్.**



ఆంధ్ర ప్రగతి నంద్యాల ఫిబ్రవరి 13: నంద్యాల పట్టణంలోని తెలుగుదేశం పార్టీ కార్యాలయం నందు కానాలకు సంబంధించిన ప్రజలు మంత్రి ఎన్ఎండి ఫరూక్ ని కలవడానికి వచ్చిన వెంటనే వారి విషయం తెలుసుకున్న మంత్రి ఫరూక్ వెంటనే వారి దగ్గరికి వెళ్లి వారి సమస్యలను అడిగి తెలుసుకుని వారి ఇళ్ల స్థలాలు సమస్య చెప్పగా విని ఎవరైతే నిజమైన అర్హులైన లబ్ధిదారులు ఉన్నారో వారికి తప్పకుండా స్థలాన్ని కేటాయించి ఇల్లు కూడా నిర్మిస్తానని మంత్రి ఫరూక్ హామీ ఇచ్చారు. సోషల్ మీడియాలో కొన్ని ఫేక్ వార్తలు వస్తున్నాయని వాటిని నమ్మవద్దని ప్రజలకు తెలియజేశారు. కానాల ప్రజలకు హామీ ఇవ్వడంతో హర్షద్వానాలతో మంత్రి ఫరూక్ కు కానాల ప్రజలు కృతజ్ఞతలు తెలపడం జరిగింది.

## సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులు అందజేసిన మంత్రి ఎన్ఎండి ఫరూక్.




ఆంధ్ర ప్రగతి నంద్యాల ఫిబ్రవరి 13:పేద ప్రజలు ఆపదలో ఉంటే 'నేనున్నాను' అని ఆదుకోవడం ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు మంచి మనసుకు నిదర్శనమని ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర న్యాయశాఖ మరియు మైనార్టీ సంక్షేమ శాఖ మంత్రివర్యులు ఎన్ఎండి ఫరూక్ అన్నారు. తెలుగుదేశం పార్టీ కార్యాలయం నందు 15 మంది లబ్ధిదారులకు 17 లక్షల రూపాయల సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులను పంపిణీ చేయడం జరిగింది.ఈ సందర్భంగా మంత్రి ఎన్ఎండి ఫరూక్ మాట్లాడుతూ ఎక్కువ ఆక్సిడెంట్స్ మరియు అనారోగ్య కారణాల వల్ల వచ్చే వారికి ఆరోగ్యం విషయంలో అజాగ్రత్త వహించకుండా జాగ్రత్తలు వహించాలని ప్రమాదాలు జరగకుండా తగు జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. పేద ప్రజలు ఏదైనా ప్రమాదంలో ప్రాణాపాయ స్థితిలో ఉన్నా, లేదా ఆరోగ్య పరంగా ప్రాణాల మీదకు వచ్చినప్పుడు అత్యవసరంగా ఆపరేషన్లకు కావల్సిన డబ్బులు లేకపోవడం, వారి స్థోమతకు మించి ఖర్చు చేయాల్సి వచ్చినప్పుడు నాకు విన్నవించుకున్న సందర్భంలో వారి ఆవేదన విని, అప్పటికప్పుడు దగ్గరుండి సీఎం రిలీఫ్ ఫండ్ కు దరఖాస్తు చేయించారన్నారు. అలా పేదవారి ఆపరేషన్ల ఖర్చుకు సంబంధించి ముఖ్యమంత్రి సహాయ నిధి నుంచి 15 మందికి వచ్చిన 17 రూపాయలను చెక్కుల రూపంలో మంత్రి ఎన్ఎండి ఫరూక్ క్యాంపు కార్యాలయంలో బాధిత కుటుంబ సభ్యులకు అందజేశారు.

## నల్లమల అడవుల్లో రోడ్డు మరమ్మత్తులు.



ఆంధ్ర ప్రగతి రుద్రవరం ఫిబ్రవరి 13: రుద్రవరం అటవీ రేంజ్ పరిధిలోని నల్లమల్ల అడవుల్లో రోడ్డు మరమ్మతు పనులు చేపట్టారు. గత కొన్ని సంవత్సరాల క్రితం అటవీ సంరక్షణ లో భాగంగా నల్లమల అటవీ ప్రాంతంలో రోడ్డు నిర్మాణం చేపట్టారు. అయితే రోడ్డు పూర్తిగా దెబ్బతినడంతో అధికారులు పర్యవేక్షణకు వెళ్లేందుకు ఇబ్బందికరంగా మారడంతో ఉన్నత అధికారులు రోడ్డు మరమ్మతులు చేపట్టాలని రూ 5 లక్షల కేటాయించారు. దీంతో దాదాపు 18 కిలోమీటర్లు పొడవున అక్కడక్కడ దెబ్బతిన్న రోడ్డుకు ఫారెస్ట్ అధికారులు మరమ్మతులు చేపట్టారు. అలాగే చిరుమానుపెంట, నాగంబావి ప్రాంతాలలో బెస్ట్ క్యాంపులు ఏర్పాటు చేశారు. వీటి పర్యవేక్షణ చేసేందుకు రోడ్డు ఉపయోగకరంగా ఉండేందుకు అధికారులు రోడ్డు మరమ్మతు పనులు చేపట్టారు.

## క్రీడా పోటీలలో విజేత ఫిజికల్ డైరెక్టర్ విజయలక్ష్మి.



ఆంధ్ర ప్రగతి నంద్యాల స్పోర్ట్స్ ఫిబ్రవరి13
నంద్యాల జిల్లా డోన్ పట్టణం జడ్.పి.హెచ్.ఎస్ ఫిజికల్ డైరెక్టర్ విజయలక్ష్మి ఇటీవలే ఏపీ పీఈటి. ఎస్ఎ పీఈ అసోసియేషన్ ఆధ్వర్యంలో కాకినాడలో నిర్వహించినటువంటి రాష్ట్రస్థాయి సెమినరీ వ్యాయామ విద్య ఉపాధ్యాయులకు వివిధ పోటీలు నిర్వహించడంతో నంద్యాల జిల్లా డోన్ పట్టణం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల కు చెందిన ఫిజికల్ డైరెక్టర్ విజయలక్ష్మి బ్యాడ్మింటన్ క్రీడా పోటీలో ద్వితీయ స్థానం నిలిచి నంద్యాల జిల్లాకు పేరు ప్రఖ్యాతలు తీసుకురావడంతో జిల్లా పిఈటి అధ్యక్షులు కార్యదర్శిలు జోసెఫ్ లక్ష్మయ్య, చందు నాయక్, జిల్లా అధ్యక్షుడు ప్రభాకర్, నంద్యాల జిల్లా కార్యదర్శి రవికుమార్, సీనియర్ ఫిజికల్ డైరెక్టర్లు శంకర్, దేవానంద్, విష్ణువర్ధన్ రెడ్డి, సంజప్ప, మరియు వ్యాయామ ఉపాధ్యాయుని ఉపాధ్యాయులు అభినందనలు తెలియజేస్తూ హర్షవ్యక్తం చేశారు.

## ఆయిల్ ఫామ్ సాగు రైతులకు డ్రిప్ సౌకర్యం కల్పించండి

**-నిర్దేశించిన పండ్ల తోటల విస్తరణ లక్ష్యాన్ని చేరుకోండి. -జిల్లా కలెక్టర్ శ్రీమతి రాజకుమారి గణియా.**







ఆంధ్ర ప్రగతి నంద్యాల, ఫిబ్రవరి 13:
జిల్లాలో 400 హెక్టార్లలో ఆయిల్ ఫామ్ సాగు చేసుకుంటున్న రైతులను ప్రోత్సహిస్తూ డ్రిప్ సౌకర్యం కల్పించేందుకు ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని జిల్లా కలెక్టర్ జి. రాజకుమారి సంబంధిత కంపెనీల ప్రతినిధులు, అధికారులను సూచించారు. గురువారం కలెక్టరేట్లోని వీడియో కాన్ఫరెన్స్ హాలులో ఆయిల్ ఫామ్ సాగు, పండ్ల తోటలు విస్తరణ, డ్రిప్ సౌకర్యం తదితర అంశాలపై సంబంధిత అధికారులతో సమీక్ష నిర్వహించారు. జిల్లా ఉద్యాన శాఖ అధికారి నాగరాజు, ఏపీఎంఐపీ పిడి సత్యనారాయణ, హార్టికల్చర్ అధికారులు, తుమ్మల, పతాంజలి, నవభారత్, తదితర కంపెనీల యాజమాన్య ప్రతినిధులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ జి. రాజకుమారి మాట్లాడుతూ జిల్లాలో 400 హెక్టార్ల ఆయిల్ ఫామ్ సాగుకు గాను 362 హెక్టార్లలో ఆయిల్ ఫామ్ సాగు అయిందని నిర్దేశించిన లక్ష్యాన్ని పూర్తి చేస్తూ ఆయిల్ ఫామ్ సాగు రైతులను ప్రోత్సహించాలని సూచించారు. తక్కువ పెట్టుబడితో అధిక లాభాలు ఆర్జించే ఆయిల్ ఫామ్ సాగుపై రైతులకు పూర్తిస్థాయిలో అవగాహన కల్పించాలన్నారు. ముందస్తుగా ఒప్పందం కుదుర్చుకున్న తుమ్మల, పతంజలి, నవభారత్ తదితర కంపెనీలు నిర్దేశించిన లక్ష్యాన్ని పూర్తి చేయడంతో పాటు బిందు సేద్యం పరికరాల ఏర్పాటుకు సంబంధిత అధికారులతో సమన్వయం చేసుకొని ప్రోత్సహించాలన్నారు. ప్రభుత్వం కూడా ఆయిల్ ఫామ్ సాగును ప్రోత్సహిస్తూ పెద్ద ఎత్తున రాయితీలను ఇస్తోందన్నారు. ఇందుకు సంబంధించి ఆయిల్ ఫామ్ విత్తనాల నర్సరీలను కూడా ఏర్పాటు చేసుకోవాలన్నారు. ఆయిల్ ఫామ్ పంట కాపుకు వచ్చేంతవరకు అంతర్ పంటలు వేసుకునేలా రైతులకు అవగాహన కల్పించాలన్నారు. ఆయిల్ ఫామ్ సాగు చేసే రైతులకు బిందు సేద్యం పరికరాలను 90 శాతం రాయితీతో ప్రభుత్వం ఇస్తుందన్నారు.
పండ్ల తోటల విస్తరణలో భాగంగా ఈ ఏడాది నిర్దేశించిన 752 హెక్టార్ల లక్ష్యానికి గాను 300 హెక్టార్లు మాత్రమే చేశారని మిగిలిన 452 హెక్టార్లలో లిల్లీ, జాజి, విరజాజి, కనకాంబరం, మల్లె తదితర పూల తోటలతోపాటు వాణిజ్య పంటల విస్తీర్ణాన్ని కూడా చేపట్టి లక్ష్యాన్ని మార్చి 15వ తేదీలోగా పూర్తి చేయాలని ఉద్యాన శాఖ అధికారులను కలెక్టర్ ఆదేశించారు. జాస్మిన్ ఆయిల్, రోజు వాటర్, అగర్ బత్తి, మిరప, పసుపు, పనస, మ్యాంగో చిల్లి, బనానా తదితర చిన్న చిన్న యూనిట్ల తయారీకి ఒక్కో ఉద్యాన అధికారి ఒక్కో అంశాన్ని ఎంపిక చేసుకొని వాల్యూ అడిషన్ జత చేసి ప్రాజెక్టు రూపకల్పనకు ఉత్సాహంతో పని చేయాలన్నారు.
జిల్లాలో 7 వేల హెక్టార్లలో డ్రిప్పు పరికరాల లక్ష్యానికి గాను 4వేల హెక్టార్లు రైతులు రిజిస్ట్రేషన్ చేయించుకొన్నారని మిగిలిన 3 హెక్టార్ల లక్ష్యాన్ని మార్చి నెలాఖరులోగా సాధించాలని కలెక్టర్ ఏపీఎంఐపి పిడిని ఆదేశించారు. 400 హెక్టార్లలో 459 మంది రైతులు ఆయిల్ ఫామ్ సాగు చేస్తున్నారని సాగు రైతులందరికీ బిందు సేద్యం పరికరాలు ఖచ్చితంగా ఇచ్చేలా చర్యలు తీసుకోవాలని కలెక్టర్ ఆదేశించారు. అనంతరం 2025 ఉద్యాన శాఖ డైరీని కలెక్టర్ ఆవిష్కరించారు.

# వ్యవసాయరంగం పురోగమిస్తేనే అభివృద్ధి

## వ్యవసాయోత్పత్తుల దిగబడులు తగ్గాలి - వ్యవసాయాధారిత పరిశ్రమలకు ప్రోత్సాహం ఇవ్వాలి

న్యూఢిల్లీ,ఫిబ్రవరి 13 ఆంధ్ర ప్రగతి :: దేశంలో వ్యవసాయం, వ్యవసాయ అనుబంధ రంగాలను అభివృద్ధి చేస్తేనే అర్థికవ్యవస్థ బలోపేతం కావడంతో పాటు, దేశంలోని ప్రజలకు తిండిగింజలకు కొదవ లేకుండా పోతోంది. అలా చేయలేనంత కాలం ఈ దేశం ఆర్థికంగా పురోగమించదని నిపుణులు పదేపదే సూచిస్తున్నా..అందుకు అనుగుణంగా అడుగులు వేయడం లేదు. దేశ జనాభాకు అనుగుణంగా అవసరమైన పంటలను ప్రోత్సహిం చాల్సి ఉంది. పంటల దిగుబడులు పెంచి, విదేశ్వాల నుంచి దిగుమతులను తగ్గించుకోవడం కూడా ముఖ్యం. ముఖ్యంగా వ్యవసాయ పంటల దిగుమతతను పూర్తిగా తగ్గించుకుంటేనే మేలు. వ్యవసాయ దిగుబడులను తగ్గించి, ఎగుమతులను పెంచుకోవాలి. వ్యవసాయాధారిత పరిశ్రమలను ప్రోత్సహించాలన్న సూచనలు పెడచెవిన పెడుతున్నారు. నదుల అనుసంధానం జరగడం లేదు. పూర్తి విద్యుత్ ఉత్పత్తి దిశగా పెట్టబడులు రావడం లేదు. మన దేశం అభివృద్ధి సాధించాలంటే గ్రామీణ ఆర్థిక వ్యవస్థ బలంగా ఉండాలి. మోడీఅధికారంలోకి వచ్చిన కొత్తలో వ్యవసాయాన్ని అభివృద్ధి చేసి, రైతుల ఆదాయాన్ని రెండింత

లు చేస్తానన్న మోడీ హామీ పదేళ్లయినా అమలు కావడం లేదు. దేశ జనాభాలో 60 శాతం మందికి పైగా వ్యవసాయంపై ఆధారపడి జీవిస్తున్నారు. అయినా ఈ రంగాన్ని పైకి తీసుకుని రావడం, వ్యవసాయాధారిత పరిశ్రమలను ప్రోత్సహించడం జరగడం లేదు. పప్పుల ధరలు పెరుగుతున్నా, మనదేశంలో పప్పు పంటలను ప్రోత్సహించడం లేదు. నూనె ధరలు పెరుగుతున్నా, నూనెగింజల పంటలకు ప్రోత్సాహం దక్కడం లేదు. వేగంగా దిగజారిపోతున్న వ్యవసాయ రంగాన్ని ఆదుకోవలసి వుంది. కానీ అలాంటి ప్రయత్నాలు జరగడం లేదు. పంటల పెట్టుబడి సహాయం పెంచకుండా, కనీస మద్దతు ధర, ఉచిత బీమా అమలు చేయకుండా వ్యవసాయ సంక్షోభాన్ని బిజెపి ప్రభుత్వం మరింత తీవ్రం చేస్తున్నది. ఆహార సబ్సిడీ తగ్గించడంతో పేదలకు అందుతున్న రేషన్ సరుకుల కోటా తగ్గిపోతుంది. ఆకలి కేకలు పెరుగుతాయి. ఉపాధి పనులను వ్యవసాయానికి అనుబంధించాలన్న డిమాండ్ పట్టించుకోవడం లేదు. దేశంలో వ్యవసాయ కూలీలు దొరకడం లేదు. పండించిన పంటలకు గిట్టుబాటు ధరలు



దక్కడం లేదు. అలాగే సామాన్యులకు తిండిగింజలు దొరకడం లేదు. అధిక ధరలతో సామాన్యులు ఉప్పులు, పప్పులు కొనుక్కోలేక పోతున్నారు. ఈ సమస్యలను పార్లమెంటు చర్చించదు. బయటా చర్చించం లేదు. దేశంలో నిరుద్యోగ తీవ్రత చాలా ఎక్కువగా వుంది.

దేశంలో పని చేయగలిగిన శ్రామికుల సంఖ్య 64 శాతానికి పెరిగిందని, కేవలం 37 శాతం మందికి మాత్రమే పనులు దొరికాయని ఓ నివేదిక తెలిపింది. యువతకు ఉపాధి కల్పించడం దేశం ఎదుర్కొంటున్న అతి పెద్ద సవాల్‌గా మారింది. సాంకేతిక పరిజ్ఞానం, కృత్రిమ మేధ ప్రభావంతో నిరుద్యోగం మరింత తీవ్రం కానుంది. ఐటి సేవల రంగాలలో తక్కువ నైపుణ్యం ఉంటే చాలన్న రీతిలో సాగుతోంది. ఐటి కంపెనీలు కూడా ఉద్యోగులను ఉన్న పళంగా తీసేస్తున్నాయి. ఈ క్రమంలో వ్యవసాయానుబంధ రంగాలను బలోపేతం చేయడం మినహా మరో గత్యంతరం లేదు. ప్రధాని మోడీ చెబుతున్నట్లుగా 2047 నాటికి దేశం సమగ్రంగా అభివృద్ధి చెందాలంటే విద్యారంగం, వ్యవసాయరంగం కీలకమని నిపుణులు సూచిస్తున్నారు.

ఆదాయం నుండి విద్య, వైద్యానికి చేసే ఖర్చులు పెరిగిపోయాయి. ఉపాధి అవకాశాలు తగ్గిపోవడంతో పాటు పెరుగుతున్న నిత్యావసర సరుకుల ధరలు ప్రజల జీవితాలను తీవ్రంగా ప్రభావితం చేస్తున్నాయి.

ఆర్థిక అంతరాలను తగ్గించడానికి సంపన్నుల మీద పన్నులు వేయడానికి మోడీ ప్రభుత్వం సిద్ధంగా లేదు.

పేదరికం లేని సమాజం కోసం ప్రణాళికలు అమలు చేయడం లేదు. వ్యవసాయ రంగం నిర్లక్ష్యానికి గురి కావడంతో ఆహారభద్రత కూడా లేకుండా పోతున్నది.

-----------

# మాజీ ఎమ్మెల్యే నేరాలు అంతా ఇంతా కావు

### వైసీపీ పాలనలో వంశీ అనేక దాడుల్లో నేరస్తుడు : కొనకళ్ల నారాయణరావు

అమరావతి,ఫిబ్రవరి 13 ఆంధ్ర ప్రగతి : వైసీపీ నేత, మాజీ ఎమ్మెల్యే వల్లభనేని వంశీ ఓ విధ్వంసకారుడని ఆర్టీసీ చైర్మన్, తెలుగుదేశం పార్టీ కృష్ణాజిల్లా అధ్యక్షులు కొనకళ్ల నారాయణరావు అన్నారు. వల్లభనేని వంశీ అరెస్టు నేపథ్యంలో గురువారం టీడీపీ కార్యాలయంలో కొనకళ్ల నారాయణరావు మీడియా సమావేశంలో మాట్లాడుతూ... 2023లో గన్నవరం టీడీపీ కార్యాలయంపై వల్లభనేని వంశీ దాడి చేయించి విధ్వంసం సృష్టించారని మండిపడ్డారు. అనేక మంది టీడీపీ నేతలపై తప్పుడు కేసులు పెట్టించి వేధించారని అన్నారు. టీడీపీ కార్యాలయంపై ఆయనే దాడి చేయించి టీడీపీ నేతలను అరెస్ట్ చేయించారని చెప్పారు. కొంతమంది తెలుగుదేశం పార్టీ మహిళా నేతలను కూడా జైలుకు పంపించారని మండిపడ్డారు. గన్నవరంలో వంశీ అరాచకాలు అన్నీ ఇన్నీ కావని చెప్పుకొచ్చారు. అధికార దుర్వినియోగానికి పాల్పడి కొన్ని వందల కోట్ల రూపాయలు దోచుకున్నారని విమర్శించారు. వల్లభనేని వంశీపై చట్టపరమైన చర్యలు తప్పవని హెచ్చరించారు. టీడీపీ కార్యాలయంపై దాడి కేసులో ఫిర్యాదుదారుడైన సత్యవర్ధన్‌ను కిడ్నాప్ చేసి బెదిరించాడని ధ్వజమెత్తారు. సత్యవర్ధన్ ఇచ్చిన



ఫిర్యాదు మేరకు వల్లభనేని వంశీపై ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కింద కేసు నమోదు చేసి అరెస్ట్ చేసినట్లు కొనకళ్ల నారాయణరావు పేర్కొన్నారు.

### వల్లభనేని చరిత్ర మొత్తం నేరమయం : ఎంవీ ప్రణవ్‌గోపాల్

ఒక నేరాన్ని కప్పిపుచ్చుకునేందుకు మరో నేరానికి మాజీ ఎమ్మెల్యే వల్లభనేని వంశీ పాల్పడ్డారని వీఎంఆర్‌డీఏ చైర్మన్ ఎంవీ ప్రణవ్ గోపాల్ చెప్పారు. వంశీ గత చరిత్ర అంతా నేర మయమని ఆరోపించారు. జగన్ గ్యాంగ్‌లో చేరి అనేక అక్రమాలకు పాల్పడ్డారని అన్నారు. దళిత యువకుడు సత్యవర్ధన్ కుటుంబ సభ్యులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు వల్లభనేని వంశీ అరెస్టు జరిగిందన్నారు. ఈ అరెస్టును ప్రజలు, ప్రజాస్వామ్యవాదులు హర్షం వ్యక్తం చేస్తున్నారని ప్రణవ్ గోపాల్ చెప్పారు.

### వంశీ, దేవినేని అవినాష్, కొడాలి నాని చీడపురుగులు : నాదెండ్ల బ్రహ్మం

వల్లభనేని వంశీ లాంటి వారిని వేటాడే ఆట మొదలైందని టీడీపీ స్టేట్ ఆర్గనైజింగ్ సెక్రటరీ నాదెండ్ల బ్రహ్మం తెలిపారు. వంశీ , దేవినేని అవినాష్ , కొడాలి నాని చీడపురుగులు అని విమర్శించారు. కన్నతల్లి లాంటి పార్టీ కార్యాలయంపై దుర్మార్గులు దాడి చేశారని మండిపడ్డారు. ఎన్టీఆర్ కుమార్తె నారా భువనేశ్వరిని ఇష్టం వచ్చినట్లుగా మాట్లాడిన వంశీకి తగిన శాస్తి జరిగిందని చెప్పారు. వంశీ అరెస్టుతో కూటమికి ఓటేసిన ప్రజలంతా హర్షాతిరేకాలు వ్యక్తం చేస్తున్నారని అన్నారు.నారా లోకేష్ రెడ్ బుక్ ఓపెన్ అయితే రిజల్ట్ ఎలా ఉంటుందో ఈరోజు నుంచి తెలుస్తుందని చెప్పారు. వంశీ, వంశీ అనుచరులు తన ఇంటిపైన దాడికి వచ్చిన సందర్భంలో ఆనాడు తాడేపల్లి పోలీస్ స్టేషన్లో ఫిర్యాదు చేశానని తెలిపారు. తాను ఇచ్చిన ఫిర్యాదుపై తక్షణమే పోలీసులు చర్యలు తీసుకోవాలని నాదెండ్ల బ్రహ్మం కోరారు.

# తెలుగుదేశం పార్టీలో చేరిన మాజీ మంత్రి ఆళ్ల నాని

### ఉండవల్లిలో చంద్రబాబు సమక్షంలో టీడీపీలో చేరిన ఆళ్ల నాని

### కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించిన చంద్రబాబు

### కార్యక్రమంలో పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు ఇతర నాయకులు



ఫిబ్రవరి 13 ఆంధ్ర ప్రగతి :

మాజీ మంత్రి ఆళ్ల నాని ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు సమక్షంలో తెలుగుదేశం పార్టీలో చేరారు. ఉండవల్లికి వెళ్లిన ఆయన ముఖ్యమంత్రి చంద్రబాబును కలిశారు. చంద్రబాబునాయుడు ఆయనకు కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ కార్యక్రమంలో పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు పల్లా శ్రీనివాసరావు, ఏలూరు జిల్లా అధ్యక్షులు గన్ని వీరాంజనేయులు, మంత్రి పార్థసారథి, ఏలూరు ఎమ్మెల్యే బడేటి చంటి, సుజయ్ కృష్ణ రంగారావు తదితరులు పాల్గొన్నారు.

# ఎన్నాళ్లకెల్లకు..

### గ్రూప్2 మెయిన్ పరీక్షపై ఏపీపీఎస్సీ కీలక ప్రకటన

APPSC

అమరావతి,ఫిబ్రవరి 13 ఆంధ్ర ప్రగతి :

ఆంధ్రప్రదేశ్ గ్రూప్ 2 మెయిన్స్ పరీక్షకు సంబంధించిన కీలక అప్‌డేట్‌ను ఆంధ్రప్రదేశ్ పబ్లిక్ సర్వీస్ కమిషన్ (ఏపీపీఎస్సీ) జారీ చేసింది. త్వరలో నిర్వహించనున్న గ్రూప్ 2 మెయిన్స్ పరీక్షకు సంబంధించిన హాల్‌టికెట్లను గురువారం (ఫిబ్రవరి 13) విడుదల చేసినట్లు ఏపీపీఎస్సీ ప్రకటించింది. అధికారిక వెబ్‌సైట్ నుంచి హాల్ టికెట్లను అభ్యర్థులు ముందుగానే డౌన్‌లోడ్ చేసుకుని అందులోని సూచనలను పాటించాలని పేర్కొంది. గతంలో ఇచ్చిన ప్రకటన మేరకు గ్రూప్ 2 మెయిన్స్ పరీక్ష జనవరి 5వ తేదీన నిర్వహించవల్సి ఉంది. కానీ అప్పట్లో మెగా డీఎస్సీ హడావిడిలో ఈ పరీక్ష నిర్వహణ సాధ్యంకాదని కమిషన్ వాయిదా వేసింది. అయితే నాటకీయ పరిణామాల దృష్ట్యా మెగా డీఎస్సీ ప్రకటన వెలువడకపోగా మరింత ఆలస్యమైంది. ఇందుకోసం వాయిదా వేసిన గ్రూప్ పరీక్ష కూడా చాలా రోజుల వరకు వాయిదా పడింది. మరోవైపు టెన్త్, ఇంటర్ పబ్లిక్ పరీక్షల నేపథ్యంలో పరీక్ష కేంద్రాలన్నీ బిజీగా మారనున్నాయి. అందుకే ఈ పరీక్షలన్నింటికంటే ముందుగానే గ్రూప్ 2 మెయిన్స్ పరీక్షలు నిర్వహించాలని భావించిన కమిషన్.. ఆ మేరకు ఫిబ్రవరి 23వ తేదీన నిర్వహించాలని నిర్ణయించింది. గ్రూప్-2 మెయిన్స్ పరీక్షలు ఫిబ్రవరి 23న మొత్తం 13 జిల్లా కేంద్రాల్లో జరగనున్నాయి. పేపర్ 1 ఉదయం 10 గంటల నుంచి 12.30 గంటల వరకు, పేపర్ 2 పరీక్ష సాయంత్రం 3 గంటల నుంచి 5.30 గంటల వరకు నిర్వహించనుంది. కాగా గత ప్రభుత్వ హాయంలో గతేడాది డిసెంబర్ 7న గ్రూప్ 2 నోటిఫికేషన్‌ను విడుదల చేయగా.. అనంతరం రెండు నెలల వ్యవధిలోనే అంటే ఈ ఏడాది ఫిబ్రవరి 25న ప్రిలిమినరీ పరీక్షను నిర్వహించింది. ఈ పరీక్షకు 4,83,535 మంది అభ్యర్థులు దరఖాస్తు చేసుకోగా.. వారిలో 4,04,037 మంది పరీక్షకు హాజరయ్యారు. ఏప్రిల్ 10న గ్రూప్ 2 ప్రిలిమినరీ పరీక్ష ఫలితాలను విడుదల చేసింది. ఇందులో 92, 250 మంది మెయిన్స్‌కు అర్హత సాధించారు. ఇప్పటి వరకూ గ్రూప్ 2 మెయిన్స్ పరీక్ష తేదీని రెండు సార్లు వాయిదా పడింది. ఈ నేపథ్యంలో ఫిబ్రవరి 23వ తేదీన మెయిన్స్ పరీక్ష నిర్వహించనున్నట్లు ఏపీపీఎస్సీ స్పష్టం చేసింది. కాగా మొత్తం 905 పోస్టుల భర్తీకి ఈ నియామక ప్రక్రియ చేపట్టిన సంగతి తెలిసిందే.

# ఫాస్టాగ్‌లో కొత్త నిబంధనలు అమలు



న్యూఢిల్లీ, ఫిబ్రవరి 13 ఆంధ్ర ప్రగతి : టోల్ రహదారులపై టోల్ వసూలు కోసం ఉద్దేశించిన ఫాస్టాగ్ లావాదేవీలకు సంబంధించి నేషనల్ పేమెంట్ కార్పొరేషన్ కొత్త నిబంధనలు తీసుకొచ్చింది. ముఖ్యంగా బ్లాక్‌లిస్ట్‌లో ఉన్న ఫాస్టాగ్ వినియోగదారులకు కొత్తగా '70 నిమిషాల' వ్యవధిని నిర్దేశించింది. నిర్దేశిత సమయంలో బ్లాక్‌లిస్ట్‌లోంచి వైదొలగడంలో విఫలమైతే డబుల్ ఫీజు ఎదుర్కోవాల్సి ఉంటుంది. కొత్త నిబంధనలు ఫిబ్రవరి 17 నుంచి అమల్లోకి రానున్నాయి. ఈ మేరకు జనవరి 28నే ఓ సర్క్యులర్ జారీ చేసింది. ఫాస్టాగ్‌లో తగిన బ్యాలెన్స్ లేకపోతే ఆ ఫాస్టాగ్ బ్లాక్‌లిస్ట్‌లోకి వెళుతుంది. టోల్‌ప్లాజా రీడర్ వద్దకు చేరుకునే సమయానికి 60 నిమిషాల కంటే ఎక్కువ సేపు ఫాస్టాగ్ ఇన్‌యాక్టివ్‌లో ఉంటే కోడ్ 176 ఎర్రర్‌ను చూపి లావాదేవీని తిరస్కరిస్తారు. అలాగే, స్కాన్ చేసిన 10 నిమిషాల తర్వాత ఇన్‌యాక్టివ్‌లోకి వెళ్లినా ఇదే కారణంతో లావాదేవీని తిరస్కరిస్తారు. ఇలాంటి సందర్భంలో పెనాల్టీ కింద రెట్టింపు టోల్ ఫీజును చెల్లించాల్సి ఉంటుంది. ఒక్క బ్యాలెన్స్ మాత్రమే కాదు.. కేవైసీ వెరిఫికేషన్ పూర్తి చేయకపోవడం, ఛాసిస్ నంబర్‌కు, వెహికల్ నంబర్‌కు మధ్య పొంతన లేకపోవడం వంటి కారణాలతో ఫాస్టాగ్ బ్లాక్‌లిస్ట్‌లోకి వెళుతుంది. ఈ నిబంధన గురించి వాహనదారులు తెలుసుకోవడం ముఖ్యం. ఫాస్టాగ్‌ను చివరి నిమిషంలో రీఛార్జి చేసే అలవాటు ఉన్న వారు దీన్ని దృష్టిలో పెట్టుకుని ముందుగానే రీఛార్జి చేసుకోవడం మంచిది.

# నందివాడ మండలంలో వెనిగండ్ల విస్తృత పర్యటన

గుడివాడ ఫిబ్రవరి 13 ఆంధ్ర ప్రగతి :గ్రామాల్లోని సమస్యలను ఒక్కొక్కటిగా పరిష్కరిస్తామని గుడివాడ ఎమ్మెల్యే వెనిగండ్ల రాముకు పేర్కొన్నారు. నందివాడ మండలంలోని దండిగానపూడి, పొణుకుమాడు, గండేపూడి గ్రామాల్లో వెనిగండ్ల గురువారం సాయంత్రం విస్తృతంగా పర్యటించారు. పర్యటనలో భాగంగా గ్రామస్థులతో మమేకమవుతూ గ్రామాల వారీగా సమావేశాలు నిర్వహిస్తూ, ప్రజా సమస్యలను తెలుసుకున్నారు. అనంతరం ఎమ్మెల్యే వెనిగండ్ల మాట్లాడుతూ చిన్న చిన్న సమస్యలన్నింటినీ తక్షణమే పరిష్కరిస్తున్నామని తెలిపారు. ఆర్థికపరమైన,



ప్రభుత్వ పాలసీ సమస్యలను ఒక్కొక్కటిగా పరిష్కరిస్తామన్నారు. అర్హులైన వారందరికీ పింఛన్లు, ఇతర ప్రభుత్వ పథకాలు అందేలా చర్యలు తీసుకుంటామని వెనిగండ్ల పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో టీడీపీ మండల అధ్యక్షుడు దానేటి సన్యాసిరావు, దండిగానపూడి గ్రామ పార్టీ నాయకులు బుసనబోయిన జగన్, నాగరాజు, గ్రేసమ్మ, లేళ్ల నాగేశ్వరమ్మ, ఎరుకపాటి సుధారాణి, కుర్మా అనూష, గండేపూడి నాయకులు ప్రసాద్, గోపి, వాసు, యలమంద, రాజ్యలక్ష్మి, పార్వతి, సర్ప కుటుంబరావు, పవన్ కుమార్, బొడ్డపాటి వెంకట శ్రీనివాసు, పొణుకుమాడు నాయకులు మరడాని శ్రీనివాసరావు, తంగుడు సింహాచలం, బండి సురేష్, దాసరి హరికృష్ణ, ఘంటసాల మారయ్య, కొంక రవికిరణ్ తదితరులు పాల్గొన్నారు.

ప్రతి అక్షరం ప్రజాహితం
ఆంధ్రప్రగతి
తెలుగు దినపత్రిక
శుక్రవారం 14 ఫిబ్రవరి 2025





### గచ్చిబౌలిలో మైక్రోసాఫ్ట్ నూతన క్యాంపస్‌ను ప్రారంభించిన సీఎం రేవంత్
### హైదరాబాద్‌తో మైక్రోసాఫ్ట్ సంస్థకు సుదీర్ఘ అనుబంధం ఉందన్న రేవంత్ రెడ్డి
### భవిష్యత్తు అంతా ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్‌దే అన్న ముఖ్యమంత్రి
### మైక్రోసాఫ్ట్ విస్తరణ ద్వారా మరిన్ని ఉద్యోగాలు వస్తాయన్న రేవంత్ రెడ్డి

# భవిష్యత్తు అంతా ఏఐదే

హైదరాబాద్,ఫిబ్రవరి 13 ఆంధ్ర ప్రగతి :
హైదరాబాద్‌లోని గచ్చిబౌలిలో మైక్రోసాఫ్ట్ నూతన క్యాంపస్‌ను తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రారంభించారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి మాట్లాడుతూ, హైదరాబాద్ నగరానికి మైక్రోసాఫ్ట్ సంస్థకు మధ్య సుదీర్ఘ అనుబంధం ఉందని అన్నారు.భవిష్యత్తు అంతా ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్‌దేనని ఆయన పేర్కొన్నారు. మైక్రోసాఫ్ట్ సంస్థ చేస్తున్న కృషిలో భాగంగా 500 పాఠశాలల్లో ఏఐని వినియోగిస్తూ బోధన జరుగుతోందని తెలిపారు

# హైదరాబాద్‌లో గూగుల్ ఏఐ సెంటర్ ఏర్పాటు
## సిఎం రేవంత్ సమక్షంలో కుదిరిన ఎంవోయూ

భవిష్యత్ ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్‌దేనని, మైక్రోసాఫ్ట్ కృషితో 500 పాఠశాలల్లో కృత్రిమ మేధ (ఏఐ) బోధన ప్రవేశపెడతామని సి ఎం రేవంత్‌రెడ్డి అన్నారు. 'మైక్రోసాఫ్ట్' నూతన క్యాంపస్ ప్రారంభం మరో మైలురా యి అని సిఎం రేవంత్ రెడ్డి పేర్కొన్నారు. మైక్రోసాఫ్ట్ విస్తరణతో యువతకు మరిన్ని ఉద్యోగాలు లభించనున్నాయని ఆయన తెలిపారు. హైదరాబాద్‌లో మరో కొత్త మైక్రోసాఫ్ట్ ఫెసిలిటీని ప్రారంభించడం మనందరికీ గర్వకారణమన్నారు. మైక్రోసాఫ్ట్–, హైదరాబాద్‌ల మధ్య సుదీర్ఘ భాగస్వామ్యం ఉందని సిఎం రేవంత్‌రెడ్డి తెలిపా రు.

మైక్రోసాఫ్ట్ నూతన భవనం ప్రారంభోత్సవంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి మా ట్లాడుతూ యువతకు మరింత సాధికారత కల్పిస్తుందని చెప్పడానికి తాను సంతోషిస్తున్నట్లు సిఎం తెలిపారు. మైక్రోసాఫ్ట్–, రాష్ట్ర ప్రభుత్వం ఇప్పుడు ఏఐ ఫౌండేషన్ అకాడమీని ప్రారంభించడంలో భాగస్వాములుగా ఉన్నామని సిఎం గుర్తు చేశారు. ఈ భాగస్వామ్యంతో తెలంగాణలో మైక్రోసాఫ్ట్ 500 ప్రభుత్వ పాఠశాలల్లో ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ విద్యను ప్రవేశపెట్టడంతో పాటు గవర్నెన్స్ అండ్ పబ్లిక్ సర్వీసెస్ కోసం ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ ఉపయోగించనున్నాయని సిఎం రేవంత్ తెలిపారు.

స్టార్టప్ ఎకో సిస్టమ్ బలోపేతం

ఈ పెట్టుబడి తమ స్టార్టప్ ఎకో సిస్టమ్ బలోపేతం చేయడంతో పాటు మెంటర్షిప్, ఏఐ టూల్స్, గ్లోబల్ నెట్‌వర్క్ యాక్సెస్‌ను ఇస్తుందని సిఎం రేవంత్‌రెడ్డి తెలిపారు. తమ ప్రభుత్వ సహకారంతో మైక్రోసాఫ్ట్ ఏఐ సెంటర్ ఏర్పాటు చేస్తున్నందుకు గర్వంగా ఉందని ముఖ్యమంత్రి చెప్పుకొ చ్చారు. ఈ కేంద్రం ఏఐ నాలెడ్జ్ హబ్ సహా క్లౌడ్ ఆధారిత ఏఐ మౌలిక సదుపాయాలను అభివృద్ధి చేస్తుందన్నారు. తెలంగాణపై నమ్మకం ఉంచిన మైక్రోసాఫ్ట్ లీడర్ షిప్ టీమ్‌కు సిఎం రేవంత్‌కు ధన్యవాదాలు తెలిపారు. ఆవిష్కరణల పట్ల మీ నిబద్ధత, మా తెలంగాణ రైజింగ్ విన్‌కు తోడ్పాటునందిస్తుందని సిఎం రేవంత్ తెలిపారు.

ప్రపంచస్థాయి మౌలిక వసతుల అభివృద్ధికి రూ.15 వేల కోట్లు: మంత్రి శ్రీధర్‌బాబు

ఐటీ, పరిశ్రమల మంత్రి శ్రీధర్ బాబు మాట్లాడుతూ హైదరాబాద్ ను మరింత ముందుకు తీసుకెళ్లేందుకు తమ ప్రభుత్వం రూ.15 వేల కోట్లతో ప్రపంచస్థాయి మౌలిక సదుపాయాలను అభివృద్ధి చేస్తోందని ఆయన వెల్లడించారు. మెట్రో రైలు విస్తరణ, రీజనల్ రింగ్‌రోడ్డు, ఫ్యూచర్ సిటీ, ఏఐ సిటీ, యంగ్ ఇండియా స్కిల్స్ యూనివర్సిటీ, విద్యుత్ వాహనాల ఉత్పత్తి కేంద్రంగా, క్వాంటమ్ ఇంజనీరింగ్, బయో ఇన్ఫర్మేటిక్స్ రంగాలతో పాటు మూసీ పునరుజ్జీవన పథకం ద్వారా ఈ నగరం సుస్థిరాభివృద్ధికి తమ ప్రభుత్వం దృఢ సంకల్పంతో ముందుకెళుతోందని శ్రీధర్ బాబు చెప్పారు. మైక్రోసాఫ్ట్ సంస్థతో హైదరాబాద్ అనుబంధం మూడు దశాబ్దాల నాటిదని, తాజాగా 11 లక్షల చదరపు అడుగుల విస్తీర్ణంలో నూతన భవనం నిర్మించడం ద్వారా తన అంకితభావాన్ని చాటుకుందని ఆయన ప్రశంసించారు.

రూ.15 వేల కోట్ల పెట్టుబడితో భారీ ఏఐ డేటా సెంటర్ల ను ఏర్పాటు చేస్తోందని ఆయన తెలిపారు. దేశంలోనే హైదరాబాద్‌ను అతిపెద్ద డేటా సెంటర్ల హబ్ గా మారుస్తున్నామని ఆయన పేర్కొన్నారు. ఏఐ సిటీలో తమ కృత్రిమ మేధ కేంద్రాన్ని ఏర్పాటు చేయనున్నట్టు ఆ సంస్థ ప్రకటించడం తమ ప్రభుత్వ విశ్వసనీయతకు నిదర్శనమన్నారు. సాంకేతిక దిగ్గజాలైన మైక్రోసాఫ్ట్ సిఇఓ సత్య నాదెళ్ల, అడోబ్, సిఇఓ శంతను నారాయణ్‌లను ప్రపంచ టెక్నాలజీకి అందించిన ఘనత ఈ నగరానికి ఉందన్నారు. నూతన ఆవిష్కరణలకు మూలస్థంభంగా నగరం స్థానం సంపాదించుకుందన్నారు. 52 ప్రపంచస్థాయి పరిశోధన కేంద్రాలు, 30కి మించిన విశ్వవిద్యాలయాలు, 6 సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్‌లు, 60 లక్షల మంది ఉత్సాహం ఉరకలెత్తే శ్రామికశక్తితో రాష్ట్రం అభివృద్ధి పథంలో ముందుకెళుతుందన్నారు. 90 లక్షల ఇళ్లను డిజిటల్ కనెక్టివిటిలోకి తీసుకొస్తున్నాస్తున్నామని శ్రీధర్ బాబు వెల్లడించారు

# వాలెంటైన్స్ డే.. మరింత స్పెషల్ గా



ఫిబ్రవరి 13 ఆంధ్ర ప్రగతి :
: ప్రేమికులకు ఎంతో ముఖ్యమైన రోజు వాలెంటైన్స్ డే.. ఈ రోజున ప్రపంచవ్యాప్తంగా ప్రేమికులు ప్రేమికుల దినోత్సవాన్ని ఒక పండుగలా జరుపుకుంటారు. కానీ, ఈ రోజు వెనుక ఒక విషాద గాథ దాగి ఉంది. అదేంటో ఇప్పుడు తెలుసుకుందాం.

: వాలెంటైన్స్ డే.. దీన్నే ప్రేమికుల దినోత్సవంగా పిలుస్తారు. వాలెంటైన్స్ వీక్ అనేది ఒక వారం ముందుగానే ప్రారంభమవుతుంది. ప్రతి సంవత్సరం ఫిబ్రవరి 14వ తేదీని ప్రేమికుల దినోత్సవంగా జరుపుకుంటారు. వాలెంటైన్స్ వీక్ ఫిబ్రవరి 7న రోజ్ డేతో ప్రారంభమై ఫిబ్రవరి 14న గ్రాండ్ ఫినాలేతో ముగుస్తుంది.

కానీ, వాలెంటైన్స్ డే ఎలా ప్రారంభమైంది? అసలు ఎందుకు ఈ వాలెంటైన్స్ డే జరుపుకుంటున్నారు? దీని వెనుక అసలు రియల్ హిస్టరీ ఏంటి? అనేది మీకు తెలుసా? మీకు ఈ ప్రేమికుల దినోత్సవం గురించి పెద్దగా తెలియకపోతే ఇప్పుడు వివరంగా తెలుసుకుందాం.

**వాలెంటైన్స్ డే చరిత్ర ఏంటి? :**

వాలెంటైన్స్ డే చరిత్ర రోమ్‌తో ముడిపడి ఉంది. మూడో శతాబ్దంలో, రోమ్‌లో సెయింట్ వాలెంటైన్ అనే వ్యక్తి ఉండేవాడు. ప్రపంచంలో ప్రేమను వ్యాప్తి చేయాలని బాగా నమ్మాడు. ప్రేమే అతని జీవితం. ప్రజలను ప్రేమించేలా ప్రేరేపించాడు. కానీ, ఆ సమయంలో రోమ్ రాజు క్లాడియస్‌కు ప్రేమను ప్రోత్సహించడం నచ్చలేదు. వివాహం సైనికుల బలాన్ని, తెలివితేటలను ప్రభావితం చేస్తుందని అది వారిని యుద్ధంలో బలహీనపరుస్తుందని అతను నమ్మాడు. అందుకే అతడు తన సైనికులు, అధికారుల వివాహాలను నిషేధించాడు.

అయితే, రోమ్ రాజు నుంచి తీవ్ర వ్యతిరేకత ఉన్నప్పటికీ, సెయింట్ వాలెంటైన్ దీనిని అంగీకరించలేదు. చక్రవర్తి ఆదేశాలను అతను ధిక్కరిస్తూ రహస్యంగా ప్రేమికులను వివాహం చేసుకోవడం ప్రారంభించాడు. ఈ విషయం క్లాడియస్ చక్రవర్తికి తెలియగానే, సెయింట్ వాలెంటైన్‌ను అరెస్టు చేసి, ఫిబ్రవరి 14, 269న అతనికి మరణశిక్ష విధించాడు.

సెయింట్ వాలెంటైన్ తాను జైలులో ఉన్న జైలర్ కుమార్తెతో ప్రేమలో పడ్డాడని, ఉరితీయడానికి ముందు, సెయింట్ వాలెంటైన్ జైలర్ కుమార్తెకు ఒక లేఖ రాశాడని, అందులో చివరలో 'మీ వాలెంటైన్' అని రాశాడని చెబుతారు. అప్పటి నుంచి ఈ రోజును ప్రేమ, అంకితభావానికి చిహ్నంగా పరిగణిస్తారు. ఫిబ్రవరి 14ని ప్రేమికుల దినోత్సవంగా జరుపుకోవడం ప్రారంభించారు.

**వాలెంటైన్స్ డే ఎందుకు జరుపుకుంటారు? :**

వాలెంటైన్స్ డే కేవలం భాగస్వాములకు మాత్రమే కాదు. ఇది ప్రేమ, స్నేహం లోతును సూచించే రోజు. మన స్నేహితుడి పట్ల మనకున్న ప్రేమను స్పష్టంగా వ్యక్తపరచడం ముఖ్యమని ఈ రోజు మనకు తెలియజేస్తుంది. ఈ రోజు ప్రపంచవ్యాప్తంగా వాలెంటైన్స్ డే జరుపుకుంటారు. జంటలు ఒకరికొకరు కార్డులు, ఫ్లవర్స్, రొమాటింక్ శుభాకాంక్షలు పంపుకుంటారు. ఈ రొమాంటిక్ మార్గాల్లో వాలెంటైన్స్ డేని ప్రత్యేకంగా జరుపుకోవచ్చు.. మీ ప్రేమగల భాగస్వామికి బహుమతి ఇచ్చే బదులు ఈ పద్ధతులను ఓసారి ప్రయత్నించండి.

### 1. ప్రేమలేఖ రాయండి :

ప్రేమలేఖ అనేది పాతదే అయినా చాలా వెరైటీగా కూడా ఉంటుంది. పాత రోజుల్లో ఈ ప్రేమలేఖతో ఎన్నో ప్రేమలు నడిచాయి. నిజమైన భావోద్వేగాన్ని ఈ పద్ధతి ద్వారానే తెలియజేయొచ్చు. మీ ప్రేమను వ్యక్తపరచడానికి ఇదే అత్యంత మధురమైన మార్గం కావచ్చు. ఇందులో మీరు మీ భావాలను వ్యక్తపరచవచ్చు. ప్రియమైనవారితో గడిపిన ప్రత్యేక క్షణాలను ఈ లేఖ ద్వారా గుర్తుంచుకోవచ్చు.

### 2. ఆల్బమ్‌ను క్రియేట్ చేయండి :

ప్రేమికుల దినోత్సవాన్ని జరుపుకునే ఈ విధానం కూడా చాలా ప్రత్యేకమైనది. మీరు మీ భాగస్వామితో గడిపిన జ్ఞాపకాలు, ఫోటోలను ఆల్బమ్‌లో సెట్ చేసుకోవచ్చు. మీరు ఆ ప్రత్యేక ఫోటోలను ఎంచుకుని వాటిపై కొన్ని లవ్ కోట్స్ రాయొచ్చు.

### 3. మీరు డిన్నర్ ప్లాన్ చేయండి :


మీ వాలెంటైన్స్ డే ప్రత్యేకంగా ఉండేందుకు మీరు రొమాంటిక్ డిన్నర్ కూడా ప్లాన్ చేసుకోవచ్చు. ఇందుకోసం మీరు మీ భాగస్వామికి ఇష్టమైన విధంగా అన్ని ఏర్పాట్లు చేయొచ్చు. మీరు అతనికి/ఆమెకు ఇష్టమైన వంటకం వండవచ్చు లేదా ఏదైనా రెస్టారెంట్‌కు తీసుకెళ్లవచ్చు.




# కొనసాగుతున్న భారతీయుల బహిష్కరణ..

### మరో రెండు విమానాల్లో తరలింపు

ఫిబ్రవరి 13 ఆంధ్ర ప్రగతి :
అమెరికాలోని అక్రమ వలసదారులపై ఉక్కుపాదం మోపుతున్న డొనాల్డ్ ట్రంప్ ప్రభుత్వం ఏరివేతను కొనసాగిస్తోంది. ఇందులో భాగంగా ఇటీవల 104 మంది భారతీయులను బహిష్కరించి స్వదేశం పంపిన అమెరికా.. తాజాగా మరో రెండు విమానాల్లో ఇండియన్లను పంపతున్నట్టు తెలిసింది. రేపు (15న) వచ్చే విమానంలో 170 నుంచి 180 మంది, ఆ తర్వాత మరో విమానంలో మరికొంతమందిని తరలిస్తున్నట్టు సమాచారం. అమెరికా బహిష్కరణ జాబితాలో మరో 487 మంది ఉన్నట్టు భారత విదేశాంగ శాఖ తెలిపింది. కాగా, అక్రమ వలసదారులను తీసుకొచ్చే విమానాలను అమృత్‌సర్‌లో ల్యాండ్ చేస్తుండటంపై పంజాబ్ ప్రభుత్వం ఆగ్రహం వ్యక్తం చేస్తోంది. రాష్ట్ర ప్రతిష్ఠను దిగజార్చేందుకు కేంద్రం ప్రయత్నిస్తోందని మండిపడింది. ఆ విమానాలను బీజేపీ పాలిత హర్యానా, గుజరాత్ రాష్ట్రాలకు ఎందుకు తరలించడం లేదని పంజాబ్ ఆర్థిక మంత్రి హర్పాల్ సింగ్ చీమా ప్రశ్నించారు. ఇకపై వచ్చే విమానాలను అహ్మదాబాద్‌లో ల్యాండింగ్ చేయించాలని డిమాండ్ చేశారు.



# మహిళా జడ్జిపై చెప్పు విసిరిన నిందితుడు



హైదరాబాద్ ఫిబ్రవరి 13 ఆంధ్ర ప్రగతి :
హైదరాబాద్‌లోని రంగారెడ్డి జిల్లా కోర్టులో కలకలం రేగింది. కోర్టు హాల్‌లో కేసు విచారణలో మహిళ జడ్జిపై నిందితుడు చెప్పులు విసరడంతో ఒక్కసారిగా ఉద్రిక్త వాతవారణం నెలకొంది. వివరాల్లోకి వెళితే.. అత్తాపూర్ సిక్ విలేజీకి చెందిన కరణ్ సింగ్ అలియాస్ సర్దార్ చీమకొర్తి (22) పలు నేరాల్లో నేరస్థుడు. కాగా జైలులో శిక్ష అనుభవిస్తున్నాడు. కేసు విచారణలో భాగంగా ఈనెల 12న రంగారెడ్డి జిల్లా 9వ అడిషనల్ సెషన్స్ జడ్జి హరిష నిందితుడికి జీవిత ఖైదీ విధిస్తూ తీర్పు వెలువరించారు.ఈ క్రమంలో నిందితుడిని కోర్టులో హాజరు పరచుగా కరణ్‌సింగ్ జైలులో తనకు ఎదురువుతున్న ఇబ్బందులపై జడ్జికి వివరించే ప్రయత్నించే క్రమంలో ఒక్కసారిగా తన కాలుకు ఉన్న చెప్పును తీసి మహిళ జడ్జిపై విసిరాడు. ఈ పరిణామంతో జడ్జి, న్యాయవాదులు ఉలిక్కి పడ్డారు. దీంతో పోలీసులు వెంటనే నిందితుడిని అదుపులోకి తీసుకున్నారు. జడ్జిపై దాడికి నిరసనగా శుక్రవారం అన్ని కోర్టుల్లో విధులు బహిష్కరిస్తున్నట్లు న్యాయవాదులు తెలిపారు.



## ప్రభాస్‌తో కలిసి నా 544వ ప్రాజెక్ట్ చేయడం ఆనందంగా ఉంది -అనుపమ్‌ఖేర్

పాన్ ఇండియా స్టార్ ప్రభాస్ హీరోగా హను రాఘవపూడి దర్శకత్వంలో ఓ సినిమా రూపొందుతున్న విషయం తెలిసిందే. ఈ చిత్రంలో బాలీవుడ్ సీనియర్ నటుడు అనుపమ్ ఖేర్ భాగమయ్యారు. ఆయన నటిస్తున్న 544వ చిత్రమిది. ఈ విషయాన్ని తెలియజేస్తూ చిత్ర బృందంతోపాటు అనుపమ్‌ఖేర్ ఎక్స్ వేదికగా పోస్ట్ పెట్టారు. “ఇండియన్ చిత్ర పరిశ్రమకు బాహుబలిగా పేరుపొందిన ప్రభాస్ కలిసి నా 544వ ప్రాజెక్ట్ చేయడం ఎంతో సంతోషంగా ఉంది. మైత్రీ మూవీ మేకర్స్ పతాకంపై టాలెంటెడ్ హను రాఘవపూడి ఈ చిత్రానికి దర్శకత్వం వహిస్తున్నారు. అద్భుతమైన కథ.. జీవితంలో ఇంతకంటే ఇంకేం కావాలి ఫ్రెండ్స్ జయహో” అని ట్వీట్ చేశారు. పీరియాడికల్ యాక్షన్ డ్రామాగా ఈ సినిమా తెరకెక్కుతుంది. దీనికి ‘ఫౌజీ’ అనే టైటిల్ ప్రచారంలో ఉంది. “మీరు ఇంతవరకూ చూడని కథను చూపిస్తున్నాం. ప్రభాస్ ఉన్నారు కాబట్టి ఎన్ని అంచనాలను అయినా అది అందుకుంటుంది. ఇప్పటివరకు ఎప్పుడూ చూడని ప్రపంచంలోకి తీసుకువెళ్తుంది. ‘సీతారామం’ తర్వాత దీనిని రాయడానికే సుమారు ఏడాదికి పైగా సమయం పట్టింది. ప్రేక్షకులు తప్పకుండా సర్‌ప్రైజ్ ఫీలవుతారు” అని దర్శకుడు ఇటీవల ఓ ఇంటర్వ్యూలో తెలిపారు. ఇందులో ప్రభాస్‌కు జోడీగా ఇమాన్వీ

## అతడు నన్ను ఎంతో వేధించాడు : ఐశ్వర్య రాజేష్




దక్షిణాది చిత్రపరిశ్రమలో కథానాయికగా మంచి గుర్తింపు తెచ్చుకుంది హీరోయిన్ ఐశ్వర్య రాజేష్. అచ్చ తెలుగు అమ్మాయి అయినప్పటికీ కోలీవుడ్ ఇండస్ట్రీలో స్టార్ డమ్ సంపాదించుకున్న ముద్దుగుమ్మ. ఇప్పుడు సంక్రాంతికి వస్తున్నాం సినిమాతో తెలుగులో భారీ విజయాన్ని అందుకుంది. డైరెక్టర్ అనిల్ రావిపూడి దర్శకత్వం వహించిన ఈ సినిమాలో విక్టరీ వెంకటేశ్ హీరోగా నటించిన సంగతి తెలిసిందే. తాజాగా ఓ ఇంటర్వ్యూలో పాల్గొన్న ఐశ్వర్య తన సినీ కెరీర్ గురించి ఆసక్తికర విషయాలను పంచుకుంది. తన తల్లి నుంచి తాను ఎంతో స్ఫూర్తి పొందానని తెలిపింది. చిన్నతనంలోనే తన తండ్రి చనిపోయారని.. దీంతో అమ్మ ఒక్కరే ఎంతో కష్టపడి తమను పెంచిందని.. ఈ ప్రయాణంలో ఆమె మానసికంగా ఎన్నో ఇబ్బందులు పడిందని తెలిపింది. చిన్న వయసులోనే పార్ట్ టైమ్ ఉద్యోగాలు చేశానని.. ఆ తర్వాత సినీరంగంలోకి అడుగుపెట్టినట్లు చెప్పుకొచ్చింది. రిలేషన్ షిప్ గురించి మాట్లాడుతూ.. లవ్ కంటే కూడా బ్రేకప్ అయినప్పుడు వచ్చే బాధ అంటే భయం. ప్రేమించే సమయం కంటే అది మిగిల్చిన బాధ నుంచి బయటకు రావడానికే ఎక్కువ సమయం తీసుకుంటాను. గతంలోనూ నేను రిలేషన్ లో ఉన్నానని తెలిపింది. సినిమాల్లోకి వచ్చిన కొత్తలో ఓ వ్యక్తిని ప్రేమించానని.. అతడు తనను ఎంతో వేధించాడని.. అంతకంటే ముందు కూడా అలాంటి ప్రేమనే చూశానని.. రిలేషన్ షిప్ లో ఎందుకు ఇలా జరుగుతుందని భయపడ్డానని.. ప్రస్తుతానికి ఎంతో సంతోషంగా ఉన్నట్లు చెప్పుకొచ్చింది.

## బ్యాగ్రౌండ్ లేకున్నా... తనదైన శైలిలో సినిమాలు...



సోషల్ మీడియాలో సినీతారల చిన్ననాటి ఫోటోస్ తెగ వైరలవుతున్న సంగతి తెలిసిందే. తాజాగా మరో హీరోయిన్ చైల్డ్ హుడ్ పిక్ నెట్టింట అందరి దృష్టిని ఆకర్షిస్తుంది. పైన ఫోటోలో తన తండ్రితో కలిసి ఉన్న చిన్నారి ఎవరో తెలుసా.. ? తెలుగు సినీ పరిశ్రమలో నటిగా తనకంటూ మంచి గుర్తింపు తెచ్చుకుంది. ఎలాంటి ఫిల్మ్ బ్యాగ్రౌండ్ లేకుండానే సినిమాల్లోకి అడుగుపెట్టి సహజ నటనతో విమర్శకుల ప్రశంసలు అందుకుంది. తెలుగుతోపాటు తమిళంలోనూ వరుస ఆఫర్స్ అందుకుంది. ఇప్పటివరకు ఎన్నో సూపర్ హిట్ చిత్రాల్లో నటించింది. ఇటీవలే భారీ బడ్జెట్ పాన్ ఇండియా సినిమాలోనూ కీలకపాత్ర పోషించింది. ఎలాంటి పాత్రలోనైనా అవలీలగా జీవించే అందమైన హీరోయిన్. ఇంతకీ ఆమె ఎవరో తెలుసా..? తనే హీరోయిన్ అంజలి. ఏపీకి చెందిన ఈ అమ్మాయి.. జీవా నటించిన డేర్ సినిమాతో తెరంగేట్రం చేసింది. తర్వాత 2006లో ఫోటో సినిమాతో తెలుగు తెరకు కథానాయికగా పరిచయమైంది. అయితే ఈ రెండు సినిమాలు అంజలికి అంతగా గుర్తింపు తీసుకురాలేదు. కానీ తమిళంలో సూపర్ హిట్ అయిన షాపింగ్ మాల్ సినిమాతో ఈ అమ్మడు క్రేజ్ ఒక్కసారిగా మారిపోయింది. ఆ చిత్రాన్ని తెలుగులో డబ్ చేయగా.. అదే స్థాయిలో రెస్పాన్స్ వచ్చింది. డైరెక్టర్ మురుగదాస్ తెరకెక్కించిన జర్నీ సినిమాతో మరోసారి అడియన్స్ ముందుకు వచ్చింది. ఈ రెండు సినిమాలు అంజలి కెరీర్ మలుపు తిప్పాయి. 2013లో వచ్చిన సీతమ్మ వాకిట్లో సిరిమల్లె చెట్టు సినిమాలో సీత పాత్రలో కనిపించింది. అంజలి.. అందం, అభినయంతో తెలుగు ప్రేక్షకులను కట్టిపడేసింది. ఆ తర్వాత అనేక చిత్రాల్లో నటించింది. గ్లామర్ షోలు కాకుండా నటనకు ప్రాధాన్యత ఉన్న సినిమాలను ఎంపిక చేసుకుంటూ తనకంటూ ప్రత్యేక ఇమేజ్ క్రియేట్ చేసుకుంది. అలాగే లేడీ ఓరియెంటెడ్ చిత్రాల్లోనూ నటించి మెప్పించిన అంజలి.. ఇటీవలే మెగా పవర్ స్టార్ రామ్ చరణ్ నటించిన గేమ్ ఛేంజర్ మూవీలో కీలకపాత్ర పోషించింది. డైరెక్టర్ శంకర్ దర్శకత్వం వహించిన ఈ సినిమాలో కియారా అద్వానీ కథానాయికగా నటించిన సంగతి తెలిసిందే.

## క్షమాపణలు చెప్పిన ‘థర్టీ ఇయర్ ఇండస్ట్రీ’ పృథ్వీ



‘లైలా’ సినిమా ప్రీ-రిలీజ్ వేడుకలో తాను చేసిన వ్యాఖ్యల పట్ల సినీ కమెడియన్ పృథ్వీ క్షమాపణలు చెప్పారు. ఈ సినిమా వేడుకలో తాను చేసిన వ్యాఖ్యల ద్వారా ఎవరి మనోభావాలైనా దెబ్బతిని ఉంటే క్షమించాలని కోరారు. ఈ మేరకు ఆయన ఓ వీడియోను విడుదల చేశారు. తనకు ఎవరి పైనా కక్ష, ద్వేషం లేదని ఆయన స్పష్టం చేశారు.తన వల్ల సినిమాకు నష్టం వాటిల్లకూడదనే ఉద్దేశంతోనే క్షమాపణలు చెబుతున్నానని పేర్కొన్నారు. ‘బాయ్‌కాట్’ లైలా అని కాకుండా ‘వెల్‌కం’ లైలా అని ఆహ్వానించాలని విజ్ఞప్తి చేశారు. ఫలక్‌నుమాదాస్ కంటే ‘లైలా’ సినిమా గొప్ప విజయం సాధించాలని ఆకాంక్షించారు.విశ్వక్ సేన్ కథానాయకుడిగా, రామ్ నారాయణ దర్శకత్వంలో, షైన్ స్క్రీన్స్ బ్యానర్ మీద సాహు గారపాటి ఈ సినిమాను నిర్మించారు. ఫిబ్రవరి 14న ఈ చిత్రం విడుదలకు సిద్ధంగా ఉంది. ఈ సినిమా ప్రీ-రిలీజ్ వేడుకలో పృథ్వీ చేసిన వ్యాఖ్యలు రాజకీయ దుమారానికి దారితీశాయి.ఈ సినిమాలో తాను మేకల సత్తి అనే పాత్రను పోషించానని, సినిమా ప్రారంభంలో 150 వరకు మేకలు ఉండేవని, సినిమా పూర్తయ్యేసరికి 11 మేకలు మాత్రమే మిగిలాయని, ఇది కేవలం యాదృచ్ఛికంగా జరిగిందో లేదో తెలియదని ఆయన అన్నారు. ఆయన చేసిన వ్యాఖ్యలపై వైసీపీ నాయకులు ఆగ్రహం వ్యక్తం చేశారు. వైసీపీని ఉద్దేశించే ఆ వ్యాఖ్యలు చేసి ఉంటారని పలువురు అభిప్రాయపడ్డారు. ఈ నేపథ్యంలో ఈ సినిమాను బహిష్కరించాలంటూ వైసీపీ సామాజిక మాధ్యమాల్లో పోస్టులు పెట్టింది. ఈ పరిణామాల నేపథ్యంలో పృథ్వీ క్షమాపణలు చెప్పారు.

## అనారోగ్యం వల్ల ఒక్కోసారి వైవాహిక జీవితంలో భారీ మూల్యం

### విడాకులపై సమంత కామెంట్



అక్కినేని నాగచైతన్య, సమంత 2017లో ప్రేమించి పెళ్ళి చేసుకున్న ఈ జంట... 2021లో విడాకులు తీసుకుంది. అయితే... విడాకులకు కారణాలు వీరిద్దరూ వేర్వేరుగా చెప్పడమే కొన్ని సార్లు చర్చనీయాంశం అవుతోంది. ఆ మధ్య ఓ పాడ్ కాస్ట్ లో నాగచైతన్య ‘తాను సమంత పరస్పర అంగీకారంతోనే విడాకులు తీసుకున్నామ’ని చెప్పాడు. మాకున్న వ్యక్తిగత కారణాలతో ఎవరి మార్గంలో వారు ప్రయాణం చేయాలని అనుకున్నాం. అందుకే విడాకులు తీసుకున్నాం’ అని స్పష్టం చేశాడు. తాజాగా సమంత మాత్రం విడాకులు విషయంలో వేరే వర్షన్ ను చెప్పింది. ప్రతి మనిషి మానసికంగానే కాకుండా శారీరకంగానూ ఎంతో ఆరోగ్యంగా ఉండాలి. అలా లేని పక్షంలో దాని ప్రభావం వైవాహిక జీవితం మీద పడుతుందని తెలిపింది. జీవిత భాగస్వామి ఎంత విశాల హృదయుడైనా... ఎంత మనసున్నవాడైనా... ఒక్కోసారి పార్టనర్ అనారోగ్యం కారణంగా వారి మధ్య గ్యాప్ ఏర్పడుతుందని ఇన్ డైరెక్ట్ గా చెప్పింది. లైఫ్ పార్టనర్ పట్ల మనకు ఉన్న ప్రేమను వ్యక్తం చేయడంలో ఒక్కోసారి అనారోగ్యం అడ్డుపడుతూ ఉంటుందని, దాంతో భారీ మూల్యం చెల్లించాల్సి రావొచ్చని నర్మగర్భంగా సెలవిచ్చింది. మొత్తం మీద తన అనారోగ్యమే విడాకులకు పరోక్షకారణమని చెప్పకనే సమంత చెప్పేసింది. ఇదిలా ఉంటే ఇటీవల శోభితా ధూళిపాలను వివాహం చేసుకున్న నాగచైతన్య ‘తండేల్’ విజయంతో ముందుకు సాగిపోతున్నాడు. అలానే... సమంత విడాకుల అనంతరం వెబ్ సిరీస్ మీద దృష్టి పెట్టి జాతీయ స్థాయిలో గుర్తింపు తెచ్చుకుని నటిగా కొనసాగుతోంది. ప్రస్తుతం నిర్మాతగానూ తన సత్తాను చాటాలని తహతహలాడుతోంది.

## వాలంటైన్స్ డే స్పెషల్.. థియేటర్లలోకి ‘ఆరెంజ్’ మూవీ




వాలంటైన్స్ డే స్పెషల్ గా గ్లోబల్ స్టార్ రామ్ చరణ్ నటించిన రొమాంటిక్ సినిమా ‘ఆరెంజ్’ రీ రిలీజ్‌కు రెడీ అయింది. రేపు ప్రేమికుల రోజు సందర్భంగా ఈ మూవీ థియేటర్లలో సందడి చేయబోతోంది. ‘బొమ్మరిల్లు’ భాస్కర్ దర్శకత్వంలో రామ్ చరణ్, జెనీలియా హీరోహీరోయిన్లుగా ‘ఆరెంజ్’ సినిమా తెరకెక్కింది. భారీ అంచనాల మధ్య విడుదలైన ఈ సినిమా ప్రేక్షకులను పెద్దగా ఆకట్టుకోలేకపోయింది. కానీ ఈ సినిమా అప్పటి యూత్, మెగా ఫ్యాన్స్‌కి ప్రత్యేకమనే చెప్పాలి. అసలు ప్రేమ ఎంతకాలం ఉంటుందనే నిజాన్ని ‘ఆరెంజ్’తో తెలియజేశాడు దర్శకుడు. 2010 నవంబర్ 26న విడుదలైన ఈ సినిమా బాక్సాఫీసు వద్ద ఆశించిన విజయం సాధించలేదు. అయితే ఆ తర్వాత కల్ట్ క్లాసిక్ స్టేటస్ అందుకుంది. ఇందులో లవర్ బాయ్ గా చరణ్ నటనకు మంచి మార్కులు పడ్డాయి. జీవితాంతం ప్రేమ అనేది అబద్ధం, కొంతకాలం మాత్రమే ప్రేమ బాగుంటుందనే సరికొత్త కాన్సెప్ట్ తో దర్శకుడు భాస్కర్ చిత్రాన్ని తెరకెక్కించాడు.ప్రేమ ఎప్పుడు ఒకేలా ఉండదు అనే నిజాన్ని ఈ సినిమా ద్వారా చూపించే ప్రయత్నం చేశాడు డైరెక్టర్. ముఖ్యంగా పాటలతో సంగీత ప్రియులను అలరించిన ‘ఆరెంజ్’ మూవీ వాలంటైన్స్ డే సందర్భంగా మరోసారి ప్రేక్షకుల ముందుకు వస్తోంది. 2023లో ఈ సినిమా రీ రిలీజ్ అవ్వగా దీనికి మంచి స్పందన వచ్చింది. మరి ఇప్పుడు ఎలాంటి రెస్పాన్స్ వస్తుందో చూడాలి. ఇప్పటికే మేకర్స్ రీ రిలీజ్ ట్రైలర్ ను కూడా విడుదల చేశారు.